# స్త్రీ నిధి సమాఖ్యను బలోపేతం చేస్తాం: మంత్రి సీతక్క



**హైదరాబాద్ పెన్ పవర్:** స్త్రీ నిధి సమాఖ్యను మరింత బలోపేతం చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క తెలిపారు. సమాఖ్య ద్వారా ఇప్పటి వరకు 32 లక్షల మందికి పైగా మహిళలకు రూ.24 వేల కోట్ల రుణాలు అందించామని, వచ్చే ఐదేళ్లలో మరో రూ. 10 వేల కోట్ల సాయం అందిస్తామన్నారు. శనివారం ప్రజాభవన్‌లో స్త్రీ నిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, డిప్యూటీ ఎండీ శ్రీనాథ్, ఇతర అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "మైక్రో ఫైనాన్స్ సంస్థలు, అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న మహిళలను ఆదుకోవడానికే 2011లో స్త్రీనిధి సమాఖ్య ఏర్పాటు చేశారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ జీవనోపాధిని మెరుగుపరుస్తున్నాం. మహిళలకు స్త్రీ నిధి నమ్మకమైన బ్యాంక్‌గా మారుతోంది" అని సీతక్క తెలిపారు. అనంతరం త్వరలో పదవీ విరమణ చేయనున్న ఎండీ విద్యాసాగర్‌రెడ్డిని సీతక్క సత్కరించారు.

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

## నా కుమారుడ్ని పోలీసులకు అప్పగించాను
### బండి సంజయ్ సంచలన ప్రకటన



- పోక్సో కేసులో పోలీసులకు లొంగిపోయిన బండి భగీరథ్
- కుమారుడిని తానే న్యాయవాదుల ద్వారా పోలీసులకు అప్పగించానని ప్రకటించిన బండి సంజయ్
- చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేసిన కేంద్రమంత్రి
- తాను ఏ తప్పు చేయలేదని భగీరథ్ చెబుతున్నాడన్న సంజయ్
- త్వరలోనే బెయిల్ వస్తుందని ఆశాభావం

హైదరాబాద్ పెన్ పవర్:కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది.

-4లో



# జైలుకు బండి భగీరథ్
## 14 రోజుల రిమాండు.. చర్లపల్లికి తరలింపు

- అంతకుముందు హైడ్రామా
- అదుపులోకి తీసుకున్నట్లు పోలీసుల వెల్లడి
- తానే అప్పగించానంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచే నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ముందస్తు బెయిలుకు, అరెస్టు నుంచి రక్షణకు హైకోర్టులో భగీరథ్‌కు ఉపశమనం లభించని నేపథ్యంలో పరిణామాలు వేగంగా మారిపోయాయి. శనివారం ఉదయం పోలీసులు భగీరథ్‌పై లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. అతణ్ని పట్టుకోవడానికి ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నివాసానికి సైతం వెళ్లారు. ఈ నేపథ్యంలో తన కుమారుడిని తానే పోలీసులకు అప్పగించినట్లు రాత్రి 8 గంటల సమయంలో బండి సంజయ్ ప్రకటన విడుదల చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే భగీరథ్‌ను అరెస్టు చేశామంటూ సైబరాబాద్ పోలీసులు ప్రకటించారు. పోలీస్ అకాడమీ(అప్పా జంక్షన్) సమీపంలో అదుపులోకి తీసుకున్నామని, నేరుగా పేట్‌బషీరాబాద్

-4లో

### పనులు చేయని గుత్తేదారులను
# పక్కన పెట్టండి

2027లో దేవాదుల ఎత్తిపోతల పూర్తవ్వాలి

సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 'సర్'పై భాజపా ఆటలు సాగనివ్వద్దు
## భారాస శ్రేణులకు కేటీఆర్ పిలుపు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 'కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి' అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజావ్యతిరేక కాంగ్రెస్‌ను పక్కనపెట్టి, భారాస ప్రభుత్వాన్ని తిరిగి తీసుకొస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన శనివారం జరిగిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)కు సంబంధించి హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 'అసెంబ్లీ' ఇన్‌ఛార్జులకు, సనత్‌నగర్ నియోజకవర్గంలో పార్టీపరంగా ఎంపిక చేసిన బూత్ లెవల్ అసిస్టెంట్లకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. సాధారణ స్థాయిలో జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం.. తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీల ఓటర్లను, వారి మద్దతుదారుల ఓటర్లను తొలగించడమే పనిగా పెట్టుకుందన్నారు. భాజపా, కాంగ్రెస్‌లు కుట్రపూరితంగా మన ఓటర్లను తొలగించకుండా క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని బీఎల్‌ఏలకు సూచించారు. సర్‌ని అత్యంత పారదర్శకంగా, పార్టీలకు అతీతంగా నిర్వహించాలని, హైదరాబాద్‌లో ఉన్న దొంగ ఓట్లు, డబుల్ ఓట్లను గుర్తించి తొలగించేలా చూడాలని ఎన్నికల కమిషన్‌ను కేటీఆర్ కోరారు. రాష్ట్రంలో భాజపా లేనేలేదని, కేవలం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గాలివాటంతో గెలిచిందన్నారు. హైదరాబాద్‌లో కనీసం తాగునీటి సరఫరా, దోమల నియంత్రణను కూడా సరిగ్గా నిర్వహించలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు ఈ సందర్భంగా సర్‌కు సంబంధించి ఎన్యుమరేటర్ నమూనా పత్రాన్ని ఆవిష్కరించారు.

# రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: కిషన్‌రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రైల్వే అధికారులతో కలిసి హైదరాబాద్ ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గత 12 ఏళ్లలో రాష్ట్రంలో 347 కి.మీ. నూతన రైల్వేలైన్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎంఎంటీఎస్ రెండోదశలో భాగంగా నగరం నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ రైలును పొడిగించనున్నట్లు వివరించారు. అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌ను రూ.26 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. డిసెంబరు నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అంతకుముందు మలక్‌పేట రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

# దేశ పౌరుడు కాని వారికి ఓటరుగా అర్హత ఉండదు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఓటరు జాబితాలో అనర్హులు లేకుండా చూడటమే సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) లక్ష్యమని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో) సుదర్శన్‌రెడ్డి తెలిపారు. దేశ పౌరుడు కాని వారికి ఓటరు జాబితాలో స్థానం ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటికి సర్ నిర్వహిస్తామని వెల్లడించారు. దేశంలో ఇప్పటి వరకు పది సార్లు చేపట్టగా ఉమ్మడి రాష్ట్రంలో చివరి సారిగా 2002లో జరిగిందన్నారు.

-4 లో

# జైలుకు బండి భగీరథ్

-3 పేజి తరువాయి

పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. భగీరథ్‌ను స్టేషన్ తీసుకెళ్లగానే కేసు పర్యవేక్షణాధికారిణి, డీసీపీ రితిరాజ్ అక్కడికి చేరుకున్నారు. ఏసీపీ శంకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ విజయ్‌వర్ధన్ నిందితుడిని కోర్టుకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అరెస్టును ప్రకటించాక భగీరథ్‌కు తొలుత స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం మేడ్చల్‌లోని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. భగీరథ్‌ను పోలీసులు రాత్రి 12 గంటల సమయంలో చర్లపల్లి జైలుకు తరలించారు.

**రోజంతా ఉత్కంఠ..**

పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 8న పోక్సో కేసు నమోదైనప్పటి నుంచి భగీరథ్ పరారీలోనే ఉన్నాడు. శనివారం ఉదయం అతను లొంగిపోతాడని ఒకవైపు ప్రచారం జరుగుతుండగానే... పోలీసులు హైదరాబాద్, కరీంనగర్‌లలోని వివిధ ప్రాంతాల్లో ఐదు బృందాలతో గాలించారు. బంజారాహిల్స్ సాగర్ సొసైటీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంట్లోనూ తనిఖీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. నిందితుడు లేకపోవడంతో గంట తర్వాత పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. విదేశాలకు పారిపోయే అవకాశముందనే అనుమానంతో పోలీసులు లుకౌట్ సర్క్యులర్ జారీ చేయడం ఉత్కంఠకు దారితీసింది. భగీరథ్‌పై కేసు నమోదైన మరుసటి రోజు నుంచే అతని ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో కాల్‌డేటా రికార్డులను పోలీసులు పరిశీలించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో ఉండే స్నేహితులతో చివరగా మాట్లాడినట్లు గుర్తించి శనివారం ఆయాచోట్ల వెతికారు. మరో ప్రత్యేక బృందం కరీంనగర్‌లోని భగీరథ్ ఇంటితోపాటు అతని మేనమామ వంశీకృష్ణ, స్నేహితులు, భాజపా కార్యకర్తల ఇళ్లలో తనిఖీ చేసినా ఫలితం కనిపించలేదు. మరోవైపు సాయంత్రం సమయంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని ఠాణాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఎక్కడైనా లొంగిపోవచ్చని భావించారు. ఈ క్రమంలోనే రాత్రి బండి సంజయ్ ప్రకటన వెలువరించడం... లొంగిపోవడం... మరోవైపు పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రకటించడం వెన్వెంటనే జరిగిపోయాయి. రాత్రి 9 గంటల సమయంలో నాలుగు కార్లలో ఇద్దరు న్యాయవాదుల్ని వెంటబెట్టుకుని భగీరథ్ నేరుగా పేట్‌బషీరాబాద్ ఠాణాకు వెళ్లినట్లు కొన్ని ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

**ఠాణా ముందు భారీ బందోబస్తు**

భగీరథ్ లొంగిపోతాడనే సమాచారంతో... సైబరాబాద్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయం, పేట్‌బషీరాబాద్ ఠాణాల దగ్గర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భగీరథ్ తరఫున న్యాయవాది ఒకరు స్టేషన్‌కు రావడంతో నిందితుడు కచ్చితంగా వస్తాడని అంచనా వేశారు. భగీరథ్‌ను బండి సంజయ్ వెంటబెట్టుకుని స్వయంగా స్టేషన్‌కు వస్తారనీ ప్రచారం జరిగింది. ముందు జాగ్రత్తగా పోలీసులు ఠాణా గేటు ముందు బారికేడ్లు ఏర్పాటు చేశారు. కేసు పంచనామా కోసం తహసీల్దార్ కార్యాలయానికి చెందిన రికార్డు అసిస్టెంట్ బాలప్రసాద్‌ను మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి పిలిపించడంతో.. బండి భగీరథ్ పోలీస్ స్టేషన్‌కు వస్తాడని అంతా అంచనా వేశారు.

**మేజిస్ట్రేట్ ఎదుట బాధితురాలి వాంగ్మూలం**

ఈ కేసులో పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 183 ప్రకారం... జడ్జి సమక్షంలో బాధితురాలి వాంగ్మూలం సేకరించారు. శనివారం ఉదయం పోలీసులు ఆమెను మేడ్చల్ కోర్టుకు తీసుకెళ్లి అక్కడే ఈ ప్రక్రియ పూర్తి చేశారు. పోక్సో కేసుల్లో న్యాయమూర్తి ముందు ఇచ్చే వాంగ్మూలం ఎంతో కీలకం. కేసు దర్యాప్తు దీని మీదే ఆధారపడి ఉంటుంది. ఈ వాంగ్మూలాన్ని వీడియో రికార్డింగ్ చేసి భద్రపరుస్తారు. బాధితురాలు కోర్టు విచారణకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దీన్నే ఆధారంగా భావిస్తారు. ఫిర్యాదుదారు అయిన బాధితురాలి తల్లి వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారు.

**14 మంది యూట్యూబర్లపై కేసు**

ఈ కేసులో మైనర్ అయిన బాధితురాలిపై యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసిన 14 మంది మీద పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ రాజారెడ్డి ఫిర్యాదుతో ఈ కేసులు నమోదయ్యాయి. మరో 27 మంది యూట్యూబర్ల మీద పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

## నా కుమారుడ్ని పోలీసులకు అప్పగించాను

-3 పేజి తరువాయి

తన కుమారుడిని న్యాయవాదుల ద్వారా పోలీసులకు అప్పగించినట్లు బండి సంజయ్ స్వయంగా వెల్లడించారు. ఈ కేసులో చట్ట ప్రకారం విచారణకు సహకరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. "చట్టం ముందు నా కుమారుడు అయినా, సామాన్యుడు అయినా అందరూ సమానమే. పోలీసులపై ఉన్న గౌరవంతోనే భగీరథ్‌ను అప్పగించాను. అందరం చట్టానికి లోబడి ఉండాల్సిందే" అని స్పష్టం చేశారు. తన కుమారుడు ఏ తప్పు చేయలేదని పదేపదే చెబుతున్నాడని, ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలను న్యాయవాదుల ద్వారా పోలీసుల ముందు ఉంచినట్లు వివరించారు.

వాస్తవానికి, ఈ ఫిర్యాదు వచ్చినప్పుడే భగీరథ్‌ను పోలీసులకు అప్పగించాలని భావించినట్లు సంజయ్ పేర్కొన్నారు. ఆధారాలను చూపేందుకే ఆలస్యం అయిందని అన్నారు. ఇంకా జాప్యం చేయడం భావ్యం కాదని తన బిడ్డను పోలీసులకు అప్పగించినట్టు వివరించారు.

ఆధారాలను పరిశీలించి కేసును కొట్టివేస్తారని, తప్పకుండా బెయిల్ వస్తుందని న్యాయవాదులు చెప్పారని ఆయన అన్నారు. ఇవాళే బెయిల్ వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మైనర్ బాలిక కుటుంబం చేసిన ఫిర్యాదు మేరకు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే.

## దేశ పౌరుడు కాని వారికి ఓటరుగా అర్హత ఉండదు

-3 పేజి తరువాయి

హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో శనివారం ఈ ప్రక్రియపై అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ అదనపు కార్యదర్శి శంకర్, సహాయ కార్యదర్శి ఎ.ఎస్.చారి, ఎన్నికల అధికారులు చెన్నయ్య, ప్రసూనాంబ, చిరంజీవిలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. "బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి రెండు ఎన్యుమరేషన్ ఫారాలు ఇస్తారు. ఒకటి పూర్తి చేసి బీఎల్వోకు ఇవ్వాలి. మరొకటి రసీదుగా ఉంచుకోవాలి. ఇంటికి వెళ్లిన సమయంలో తాళం ఉంటే బీఎల్వోలు మళ్లీ వెళ్లాలి. ఆన్‌లైన్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా ఎన్యూమరేషన్ చేసుకునే అవకాశం ఉంది. జులై 31న ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటిస్తాం. ఈ జాబితాను రాజకీయ పార్టీలకు అందిస్తాం. చీఫ్ ఎలక్టోరల్ అధికారి వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంటుంది. జిల్లా ఎన్నికల అధికారి, ఓటరు నమోదు అధికారి(ఈఆర్వో) కార్యాలయాల వద్ద జాబితాను ఉంచుతాం. ఓటరు ముసాయిదా జాబితాపై జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలను అందించవచ్చు. ఎన్యుమరేషన్ ఫారంలో ఏమైనా సందేహాలు ఉంటే ఎన్నికల అధికారులు నోటీసులు ఇస్తారు. 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి సందేహాలను తొలగించవచ్చు. అక్టోబరు 1న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తాం" అని సీఈవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

**షెడ్యూల్ ప్రకారం కచ్చితంగా కొనసాగుతుంది..**

"రాష్ట్రంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సర్ కచ్చితంగా కొనసాగుతుంది. ఇప్పటికే నిర్వహించిన రాష్ట్రాల్లో కొన్ని చోట్ల అక్కడి పరిస్థితులను బట్టి మార్పులు చేశారు. రాజకీయ పార్టీలు కూడా సర్‌పై పలు విజ్ఞప్తులు చేస్తున్నాయి. సందేహాలకు ఓటరు టోల్‌ఫ్రీ నంబరు 1950ను అందుబాటులోకి తెచ్చాం.

కేంద్ర ఎన్నికల వెబ్‌సైట్ లేదా ఈసీఐనెట్ యాప్ ద్వారా 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్వో' సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఇప్పటికే ఈఆర్వోలు, బీఎల్వోలకు మూడు, నాలుగు దఫాలుగా శిక్షణ అందించాం. ఒక్కో రాజకీయ పార్టీ బూత్‌కు ఒక్కరు చొప్పున 35వేల మంది బీఎల్ఏలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు అన్ని పార్టీలు కలిపి 25 వేల మందినే ఏర్పాటు చేసుకున్నాయి. వలస కార్మికులు, గల్ఫ్ కార్మికులు ఆన్‌లైన్‌లో తమ ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించవచ్చు. ఆధార్‌కార్డును గుర్తింపు కోసం ఉపయోగించుకోవచ్చు" అని విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 64.38 శాతం మ్యాపింగ్ జరిగిందని, ఇది సర్ ప్రక్రియ కాదని తెలిపారు.

## పనులు చేయని గుత్తేదారులను పక్కన పెట్టండి

**హైదరాబాద్ పెన్ పవర్:** దేవాదుల ఎత్తిపోతల పథకంలో పనులు నిలిచిపోయిన ప్యాకేజీల కాంట్రాక్టులను అవసరమైతే రద్దుచేసి, తిరిగి టెండర్లు పిలిచి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో ఈ పథకం పురోగతిపై మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి సమీక్షించారు. ఉత్తమ్ మాట్లాడుతూ.. 'పనులు చేయని గుత్తేదారుల ఒప్పందాలను వెంటనే రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలి. ఈ పథకాన్ని 2027 డిసెంబరు 31 నాటికి పూర్తిచేయాలి. దీనికోసం అవసరమైన నిధులు, సాంకేతిక సహాయం, పరిపాలన అనుమతులను ప్రభుత్వం అందజేస్తుంది' అన్నారు. ప్యాకేజీ–6ను పాత గుత్తేదారు సమయానికి పూర్తి చేయకపోవడంతో ఒప్పందాన్ని రద్దు చేసి కొత్త సంస్థకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. పెండింగ్ భూసేకరణ కేసులను

వెంటనే టోకెన్ దశకు తీసుకెళ్లి పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని మంత్రి వారికి సూచించారు. '38.16 టీఎంసీల సామర్థ్యంతో రూ.6,016 కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టిన ఈ పథకం అంచనా వ్యయం రూ.18,400 కోట్లకు పెరిగింది. ఇప్పటివరకు రూ.14,422 కోట్లు ఖర్చయింది. మరో రూ.3,978 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉంది' అని పేర్కొన్నారు. ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాగరాజు, మురళీనాయక్, మాధవరెడ్డి, జి.సత్యనారాయణ, రామచంద్రునాయక్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శాఖ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

**కరీంనగర్ పెన్ పవర్:**రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. శనివారం నాడు కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో విశ్వ హిందూ పరిషద్ బజరంగ్ దళ్,గోరక్ష ప్రముఖ్ తదితర హిందూ మత సంఘాల ప్రతినిధులతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.పండుగ వేళ ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. పశువుల అక్రమ రవాణా లేదా గోవధకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా,తక్షణమే పోలీసులకు తెలియజేయాలే తప్ప చట్టాన్ని ఉల్లంఘించ కూడదని హెచ్చరించారు. అలా కాదని చట్టాన్ని అతిక్రమిస్తే,తెలంగాణ గోవధ నిషేధ మరియు జంతు సంరక్షణ చట్టం,1977 ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు.

**వ్యూహాత్మక ప్రాంతాలలో 6 చెక్‌పోస్టులు**

పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 121 చెక్‌పోస్టులు,52 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయని. .కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా 6 చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.35 వేల లంచం.. ఏసీబీకి అడ్డంగా దొరికిన లైన్ మెన్







**హైదరాబాద్ పెన్ పవర్:**యాదాద్రి భువనగిరి జిల్లాలో విద్యుత్ శాఖ అసిస్టెంట్ లైన్ మెన్ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. మోటకొండూరు మండలంలోని మేడికుంటపల్లి గ్రామానికి చెందిన రైతు అనంతరెడ్డి.. తన వ్యవసాయ క్షేత్రం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని అధికారుల చుట్టూ తిరిగాడు. ఇందుకోసం మూడు నెలల క్రితమే రూ.30 వేల డీడీలు కూడా చెల్లించాడు. అయినా ఫలితం లేకపోవడంతో.. ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలంటూ పలుమార్లు ఏఈ, అసిస్టెంట్ లైన్మెన్లను వేడుకున్నాడు. పని పూర్తయ్యాక రూ.10 వేల ఇస్తానని కూడా చెప్పాడు.

కానీ.. లంచం ఇస్తేనే పని జరుగుతుందంటూ అసిస్టెంట్ లైన్మెన్ రమేష్ పట్టుబట్టాడు. ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలంటే ఏకంగా 35 వేల రూపాయల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లైన్మెన్ వేధింపులతో విసిగిపోయిన రైతు అనంతరెడ్డి.. రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.రైతు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. రెండు రోజులుగా పక్కా వ్యూహంతో రెక్కీ నిర్వహించారు. ఈ క్రమంలో, అనంతరెడ్డి నివాసం వద్ద లైన్మెన్ రమేష్ 35 వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లంచం అడిగితే సహించేది లేదని, బాధితులు ఎవరైనా ఉంటే ఏసీబీని ఆశ్రయించాలని అధికారులు స్పష్టం చేశారు.

## ఉప్పల్ ఐపీఎల్ మ్యాచ్ క్రేజ్.. అలా చేస్తే మీ కష్టార్జితం గల్లంతేనన్న సీపీ సజ్జనార్!

హైదరాబాద్ ఐపీఎల్ మ్యాచ్ టికెట్లకు భారీ డిమాండ్
నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్లతో సైబర్ నేరగాళ్ల మోసాలు
అప్రమత్తంగా ఉండాలంటూ సీపీ సజ్జనార్ హెచ్చరిక
అధికారిక యాప్ ద్వారానే టికెట్లు కొనాలని సూచన
మోసాలపై ఫిర్యాదుకు 1930 నంబర్‌కు కాల్ చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**నగరంలో ఐపీఎల్ ఫీవర్ తారాస్థాయికి చేరుకుంది. ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఈ నెల 22న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగనున్న మ్యాచ్‌కు విపరీతమైన డిమాండ్ నెలకొంది. విరాట్ కోహ్లీ, ప్యాట్ కమిన్స్ వంటి స్టార్ ఆటగాళ్ల పోరును ప్రత్యక్షంగా వీక్షించాలన్న అభిమానుల ఆతృతను సైబర్ నేరగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. నకిలీ యాప్‌లు, మోసపూరిత వెబ్‌సైట్ల ద్వారా టికెట్ల విక్రయం పేరుతో భారీ దోపిడీకి తెరలేపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ క్రికెట్ ప్రియులకు కీలక హెచ్చరికలు జారీ చేశారు.ప్రస్తుతం సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, 'ఎక్స్' (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్‌లలో ఐపీఎల్ టికెట్లపై ఆకర్షణీయమైన ప్రకటనలు వెల్లువెత్తుతున్నాయి. ఐపీఎల్ అధికారిక టికెటింగ్ భాగస్వామి అయిన 'డిస్ట్రిక్ట్' యాప్‌ను పోలిన నకిలీ యాప్‌లను, క్లోన్ వెబ్‌సైట్లను సైబర్ నేరగాళ్లు సృష్టించారు. అసలు యాప్‌ను తలపించేలా లోగోలు, డిజైన్లు ఉపయోగించి, తక్కువ ధరలకే ప్రీమియం స్టాండ్ టికెట్లు ఇస్తామంటూ ఊరిస్తున్నారు. ఈ నకిలీ యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ లేదా ఏపీకే ఫైల్స్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకునేలా లింకులను పంపిస్తున్నారు.ఈ మోసాలపై సీపీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక ఐపీఎల్ టికెట్ ప్రకటనలను నమ్మవద్దు. అధికారిక యాప్‌ను పోలిన నకిలీ లింకులను క్లిక్ చేసి టికెట్లు బుక్ చేస్తే మీ డబ్బు గల్లంతవ్వడం ఖాయం. డబ్బులు కోల్పోవడమే



కాకుండా, మీ బ్యాంకు ఖాతా వివరాలు కూడా నేరగాళ్ల చేతికి చిక్కే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు.మ్యాచ్ చూడాలనే ఉత్సాహంతో సోషల్ మీడియా లింకులు, బ్లాక్ మార్కెట్ టికెట్ల ప్రకటనలను నమ్మి మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలాంటి నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్లపై నిఘా ఉంచామని, ఎవరికైనా అనుమానాస్పద సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 1930 లేదా స్థానిక సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. క్రికెట్ అభిమానులు తమ కష్టార్జితాన్ని కాపాడుకోవడానికి అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ భవన్లో జరిగిన సనత్నగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గోన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సంబంధించి ఎంపిక చేసిన బూత్ లెవెల్ అసిస్టెంట్లతో కూడిన ఈ సమావేశంలో కేటీఆర్ వారికి ఎస్ఐఆర్ (ావఖీ) పైన దిశానిర్దేశం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణవ్యాప్తంగా "కాంగ్రెస్ పోవాలి, కేసీఆర్ రావాలి" అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉన్నది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ను పక్కన పెట్టి, ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకువస్తారు. తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీల ఓటర్లను, వారి మద్దతు దారులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రాల్లో ఈ ఎస్ఐఆర్ను అడ్డగోలుగా వినియోగించడం వంటి అనేక ఆరోపణలున్నాయి. ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ లేనే లేదు.. కేవలం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వచ్చిన గాలి గత్తర వల్ల కొంత కనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఎక్కువ, సొసైటీలో తక్కువ ఉన్న పార్టీ బీజేపీ. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్నది కూల్చివేతలే. నగరంలో కనీసం తాగునీటి సరఫరా, దోమల నియంత్రణ వంటి అంశాలను కూడా నిర్వహించలేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదరి అన్నారు.

## కరీంనగర్ అభివృద్ధికి 895 కోట్లు కేంద్రం పచ్చజెండా

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 895 కోట్లతో ప్రతిపాదించిన మూడు ప్రాజెక్టులకు అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ చొరవతో రహదారులు వరద నివారణ, వ్యర్థాల నిర్వహణ పనులకు ఈ నిధులు అందనున్నాయి. ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర అధికారుల బృందం నగరానికి రానుంది మంత్రి సంజయ్ కృషితో కరీంనగర్ మోడల్ సిటీగా మారనుందని అధికారులు తెలిపారు.

## రోడ్ నిర్మాణ పనులు పరిశీలించిన కలెక్టర్ కె. హైమావతి

**హుస్నాబాద్ పెన్ పవర్:** హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు 77.20కోట్లతో నాలుగు వరసల రోడ్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రోడ్ వెంబడి చెట్లు కటింగ్, పొదల తొలగింపు ప్రక్రియ దాదాపు పూర్తి అయిందని ఎలక్ట్రిక్ స్తంభాల షిఫ్టింగ్ పనులు సైతం వేగంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్ జాయింట్ పర్యవేక్షణ చేసి మున్సిపల్ ప్రాంతాల్లో పెండింగ్ లో ఉన్న చెట్లు కటింగ్,మార్నింగ్ చేసిన వరకు నివాసాలను తొలగించే ప్రక్రియ పూర్తి చెయ్యాలని ఆదేశించారు. రోడ్ పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కాల వ్యవధిలోపు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ రామ్మూర్తి, తహసిల్దార్ లక్ష్మా రెడ్డి, విద్యుత్ శాఖ డిఈ, తదితరులు ఉన్నారు.

## సైబరాబాద్‌లో కొత్త తరహా సైబర్ నేరం

**హైదరాబాద్ పెన్ పవర్:** సైబరాబాద్ లో సరికొత్త తరహ సైబర్ నేరం బయటపడింది. ఈ సిమ్ ను ఫిజికల్ సిమ్ గా మార్చాలనీ బ్యాంక్ అధికారుల పేరుతో బాధితుడికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసారు. ఈ సిమ్ ను చేంజ్ చేసి జనరల్ సిమ్ గా మార్చి తాము పంపిన ఫోన్ లో వేయండి అని నమ్మించారు. మోటోరాల ఫోన్ ను బాధితుడికి పంపి ముందుగానే కొన్ని యాప్ లను పెట్టారు. తరువాత బాధితుడి ఖాతాలో ఉన్న 77 లక్షలు రూపాయలు కాజేసారు సైబర్ నేరగాళ్లు. సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ వెస్ట్ బెంగాల్ లో ఒక చెట్టు కింద కూర్చుని ఈ తరహా సైబర్ నేరానికి సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్నారు. అచ్చం జాంతార తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ నేరంలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసారు. 15 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నెల రోజుల పాటు వెస్ట్ బెంగాల్, ఢిల్లీ లో ఆపరేషన్ నిర్వహించినట్లు డీసీపీ వెల్లడించారు.

## కోదాడ లో "బడిబాట"


**కోదాడ పెన్ పవర్:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం "బడిబాట" (ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట) కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినులు కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో లభించే నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన పథకం మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన వంటి వసతులను వివరించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, బడి వయసు పిల్లలు ఎవరూ బయట ఉండకుండా చూడాలని కోరారు.టాపర్లకు అభినందనల జల్లు:ఇదే వేదికపై, ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటిన విద్యార్థినులు కట్టికోల పూజశ్రీ మరియు మాలవతు పవిత్రలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు తోటి విద్యార్థినులు ఘనంగా అభినందించారు. వారి ప్రతిభ మిగిలిన విద్యార్థినులకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కూడా కార్పొరేట్ సంస్థలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని ఈ విద్యార్థినులు నిరూపించారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## హోటల్లో అగ్ని ప్రమాదం.. తప్పిన ప్రాణ నష్టం

**సికింద్రాబాద్.. పెన్ పవర్:** రెజిమెంటల్ బజార్ మెట్రో పాలిస్ హోటల్ లో తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంబంధించినది. ఈ హోటల్లోని మూడవ అంతస్తులో ఉన్న వంట గదిలో నుండి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి పక్కనే ఉన్న రెస్టారెంట్ కు వ్యాపించడంతో అగ్ని ప్రమాద తీవ్రత పెరిగింది.మంటల తీవ్రత వేడి కారణంగా, వంటగదిని ఆనుకుని ఉన్న భోజనశాల అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిమాపక సిబ్బంది మంటలు మిగిలిన అంతస్తులకు భవనంలోని ప్రక్క భాగాలకు వ్యాపించకుండా నివారించారు. ఈ హోటల్లో బస చేస్తున్న 67 మంది ఈ అగ్ని ప్రమాద ఘటనకు భయాందోళనకు గురికాగా వారిని హైడ్రాలిక్ ప్లాట్ఫామ్ వెహికల్ బ్రాంటో స్కైలిఫ్ట్ ద్వారా సురక్షితంగా కాపాడినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యుతఘాధం మూలంగానే అగ్నిప్రమాదం సంభవించిందని అగ్నిమాపక అధికారులు భావిస్తున్నారు.

## ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ భవన్లో జరిగిన సనత్నగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గోన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సంబంధించి ఎంపిక చేసిన బూత్ లెవెల్ అసిస్టెంట్లతో కూడిన ఈ సమావేశంలో కేటీఆర్ వారికి ఎస్ఐఆర్ (ా×=) పైన దిశానిర్దేశం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణవ్యాప్తంగా "కాంగ్రెస్ పోవాలి, కేసీఆర్ రావాలి" అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉన్నది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ను పక్కన పెట్టి, ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకువస్తారు. తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీల ఓటర్లను, వారి మద్దతు దారులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రాల్లో ఈ ఎస్ఐఆర్ను అడ్డగోలుగా వినియోగించడం వంటి అనేక ఆరోపణలున్నాయి. ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ లేనే లేదు.. కేవలం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వచ్చిన గాలి గత్తర వల్ల కొంత కనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఎక్కువ, సొసైటీలో తక్కువ ఉన్న పార్టీ బీజేపీ. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్నది కూల్చివేతలే. నగరంలో కనీసం తాగునీటి సరఫరా, దోమల నియంత్రణ వంటి అంశాలను కూడా నిర్వహించలేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదరి అన్నారు.




## విద్యా సంస్కరణలకు తల్లిదండ్రులు సహకరించాలి



**రాజన్న సిరిసిల్ల పెన్ పవర్:** ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలు ఆశించిన ఫలితాలు ఇవ్వాలంటే తల్లిదండ్రుల పూర్తి సహకారం అవసరమని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు పేర్కొన్నారు. విద్యా వారోత్సవంలో భాగంగా శనివారం ఎంసీహెచ్ఆర్డీలో ఆర్ట్స్, క్రాఫ్ట్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా హస్తకళల ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు కళలు, సాహిత్యం, వంటి రంగాల్లో రాణించడానికి ఉపాధ్యాయులు తగిన ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కవితల సంపుటిని రచించిన సిటీ కళాశాల విద్యార్థిని హరిప్రియను ఆయన అభినందించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. గత విద్యా సంవత్సరంలో 100 శాతం హాజరు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, అదనపు సంచాలకులు కందిమళ్ల లింగయ్య, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



**రాజన్న సిరిసిల్ల పెన్ పవర్:** : ధాన్యం సేకరణ ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని,ధాన్యం తరలింపు,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీలో జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం,వాహనాల ద్వారా ధాన్యం తరలింపు, హమాలీల సంఖ్య పెంచి అన్ లోడింగ్ చేయడం,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై శనివారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఆర్డీఓలు, పౌర సరఫరాలు,వ్యవసాయ, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా,మెప్మా, మార్కెటింగ్,మార్క్ ఫెడ్,కార్మిక శాఖ అధికారులు,అన్ని మండలాల ప్రత్యేకాధికా రులు, తహసీల్దార్లు, ఏపీఎం లు, ప్యాక్స్ సెక్రటరీలతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని,వాహనాలు సమకూర్చకపోతే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్ కు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ కోసం, మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూడాలని, హమాలీల సంఖ్యను డిమాండ్ కు అనుగుణంగా పెంచి, ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా రైతుల నుండి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ జాప్యం చేయవద్దని ఆదేశించారు. ఏపీఎం లు ప్రత్యేకంగా దీనిపై దృష్టి సారించి తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద ఉన్న పరిస్థితులను పర్యవేక్షణ చేయడానికి కేటాయించిన రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని,క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

## అర్ధరాత్రి వ్యూహం.. తెల్లవారుజామున మెరుపు దాడి!

### అన్నమయ్య జిల్లాలో పోలీసుల 'ఆపరేషన్ వజ్రప్రహార్'



**హైదరాబాద్ పెన్ పవర్:** శాంతిభద్రతల పరిరక్షణే శ్వాసగా, ప్రజల సురక్షిత జీవనమే పరమావధిగా అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ శనివారం తెల్లవారుజామున అత్యంత పకడ్బందీగా రెండు భారీ నిఘా ఆపరేషన్‌లను నిర్వహించింది. జిల్లాను నేరరహితంగా మార్చడానికి, సమాజానికి ముప్పుగా పరిణమి స్తున్న శక్తుల ఆటకట్టించడానికి "ఆపరేషన్ వజ్రప్రహార్" నిర్వహించారు. ఈ వ్యూహాత్మక చర్య శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత, జిల్లా అంతా ప్రశాంతంగా నిద్రిస్తున్న సమయంలో అత్యంత నిశ్శబ్దంగా మొదలైంది. మదనపల్లె, రాయచోటి సబ్ డివిజన్లలోని సమస్యాత్మక ప్రాంతాలే లక్ష్యంగా పోలీసులు కార్యాచరణకు సిద్ధమయ్యారు. సరిగ్గా సమయం ఉదయం 4:00 గంటలు.. కోడికూత కూడా వినబడని ఆ కారుచీకట్లో ప్రజల రక్షణ కోసం పోలీస్ బలగాలు అడుగులు వేశాయి. మదనపల్లె డీఎస్పీ శ్రీమతి బి. పావని గారి నేతృత్వంలో 105 మంది, రాయచోటి డీఎస్పీ శ్రీ ఎం.ఆర్. కృష్ణమోహన్ గారి నేతృత్వంలో 61 మంది.. మొత్తం 166 మంది నిబద్ధత గల పోలీస్ అధికారులు, సిబ్బంది ఏకకాలంలో రంగంలోకి దిగారు. ఎవరికీ ఎటువంటి ముందస్తు సమాచారం లీక్ కాకుండా, అత్యంత రహస్యంగా మదనపల్లె తాలూకా పరిధిలోని కోళ్లబైలు జగన్ కాలనీ, కలకడ మండలం బంగారువాండ్లపల్లి గ్రామాలను పోలీసులు చుట్టుముట్టారు. నిశ్శబ్దంగా సాగిన ఈ మెరుపు తనిఖీలు (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది వీధుల్లో సోదాలు నిర్వహిస్తుండగా, భూతలం నుండి ఎవరూ తప్పించుకోకుండా నిఘాను మరింత పటిష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు అధునాతన డ్రోన్ కెమెరాల ద్వారా గ్రామాలపై గగనతలం నుంచి పర్యవేక్షణ చేపట్టారు. గ్రామంలోని ప్రతి ప్రాంతాన్ని నిశితంగా పరిశీలిస్తూ అసాంఘిక శక్తుల కదలికలను గుర్తించేలా నిఘా కొనసాగించారు. ఈ అధునాతన నిఘా వ్యవస్థతో గ్రామాల్లోని ప్రతి సందు, పొదలు మరియు నిర్మానుష్య ప్రాంతాలను కంట్రోల్ రూమ్ స్క్రీన్లపై నిరంతరం పర్యవేక్షించారు.పోలీసులు పన్నిన ఈ రక్షణ వలయంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా సాగాయి. రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తూ, నెంబర్ ప్లేట్లు మార్చి, సరైన రికార్డులు లేకుండా తిరుగుతున్న వాహనాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆయా ప్రాంతాలలో అనుమానాస్పదంగా ఉన్న మొత్తం 133 వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. పక్కా ఆధారాలు లేని 78 వాహనాలను స్పాట్‌లోనే స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందులో 71 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 2 కార్లు మరియు ఒక ట్రాక్టర్ ఉన్నాయి. చట్టపరమైన పూర్తి పత్రాలు సమర్పించిన తర్వాతే ఈ వాహనాలను విడుదల చేయడం జరుగుతుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అయితే పోలీస్ శాఖ అంటే కేవలం తనిఖీలు, కేసులు మాత్రమే కాదు.. ప్రజలతో మమేకమయ్యే రక్షకులు అని నిరూపిస్తూ, తనిఖీల అనంతరం మదనపల్లెలో 300 మంది, కలకడలో 210 మంది ప్రజలను ఒకచోటకు చేర్చి ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. స్థానిక శాంతిభద్రతల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. "మా ప్రాంతాల రక్షణే మా బాధ్యత. ఊర్లోకి కొత్త వ్యక్తులు వచ్చినా, లేదా ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనించినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించండి" అని స్థానికుల్లో ధైర్యాన్ని నింపారు.
అనంతరం సమాజ శ్రేయస్సు కోసం, నేరాల నిర్మూలన కోసం ప్రజలందరితో కలిసి పోలీసులు, ఈగల్ టీమ్ సిబ్బంది "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" చేయించారు. ప్రజలు, పోలీసులు కలిసికట్టుగా నిలబడిన ఆ క్షణం ఈ ఆపరేషన్‌కే మకుటాయమానంగా నిలిచింది.యువత భవిష్యత్తును పాడుచేస్తూ, సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల (గంజాయి, డ్రగ్స్) ముఠాలను వేరుతో సహా తొలగించడమేనని. ఈ సందర్భంగా డిఎస్పీ లు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై జిల్లాలో గంజాయి రవాణా చేసినా, విక్రయించినా పాత నేరస్థులైనా, కొత్త వారైనా సరే.. పీడీ యాక్ట్, పి.ఐ.టి, ఎన్‌డీపీఎస్ చట్టాల కింద అత్యంత కఠినమైన జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.

# గులాబీ మిషన్ 2028

**హైదరాబాద్, మే 16 పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో మరోసారి గులాబీ జెండా రెపరెపలాడించేందుకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు సమర శంఖం పూరించారు. పార్టీ ఓటమి అనంతరం కొంతకాలం స్తబ్దుగా ఉన్న గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపేందుకు మంగళవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో కేసీఆర్ కీలక భేటీ నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు సహా 23 మంది ముఖ్య నేతలతో సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశం, కేవలం ఒక సమీక్షగా కాకుండా, రాబోయే నాలుగేళ్ల ప్రయాణానికి దిక్సూచిగా నిలిచింది.కేసీఆర్ తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం డిజిటల్ సభ్యత్వ నమోదు. గతంలో అనుసరించిన సంప్రదాయ సభ్యత్వ పద్ధతులకు స్వస్తి పలికి, పూర్తిస్థాయిలో సాంకేతికతను జోడించి సభ్యత్వాలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో బూత్ స్థాయి నుంచి సభ్యుల సమాచారాన్ని డిజిటలైజ్ చేస్తారు.దీనివల్ల క్షేత్రస్థాయి కార్యకర్తకు, పార్టీ అధిష్టానానికి మధ్య మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంబంధం ఏర్పడుతుంది. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమన్వయకర్తలను నియమించి, పార్టీ కార్యకలాపాల్లో పారదర్శకతను పెంచనున్నారు.రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. రైతు రుణమాఫీలో జాప్యం, ధరణి పోర్టల్ సమస్యలు, నిరుద్యోగ భృతి వంటి హామీల వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. గతంలో నిర్వహించిన భారీ బహిరంగ సభల కంటే, ఈసారిప్రజలతో నేరుగా మమేకమయ్యేలా 'జన చైతన్య యాత్రల'కు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామాల వారీగా తిరుగుతూ, ప్రజల సమస్యలపై పోరాడటం ద్వారానే పూర్వ వైభవం సాధ్యమవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు.పదేళ్ల అధికార



కాలంలో నాయకులకు, సాధారణ కార్యకర్తలకు మధ్య ఏర్పడిన దూరాన్ని గుర్తించిన కేసీఆర్, పార్టీ నిర్మాణంలో భారీ మార్పులు సూచించారు. కేవలం నాయకుల చుట్టూ తిరిగే పార్టీగా కాకుండా, క్షేత్రస్థాయి కార్యకర్తలే నిర్ణయాత్మక శక్తిగా ఉండేలా క్యాడర్ డ్రివెన్ వ్యవస్థగా బీఆర్ఎస్ రూపాంతరం చెందబోతోంది. ప్రతి కార్యకర్తకు రాజకీయ భద్రత కల్పించడంతో పాటు, కష్టకాలంలో పార్టీ కుటుంబంలా అండగా ఉంటుందనే భరోసా ఇచ్చేలా సంస్థాగత రక్షణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు.బీఆర్ఎస్ పునర్నిర్మాణం కేవలం కమిటీల మార్పుకే పరిమితం కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని, అభివృద్ధిని మళ్లీ చర్చలోకి తెచ్చే ప్రయత్నమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 'రీక్లెయిమింగ్ తెలంగాణ' అనే నినాదంతో, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా బీఆర్ఎస్‌ను మళ్ళీ నిలబెట్టాలని కేసీఆర్ సంకల్పించారు.మొత్తంగా, ఎర్రవెల్లి భేటీ బీఆర్ఎస్ పార్టీలో నిస్తేజాన్ని వదిలించుకుని ఒక శక్తివంతమైన ప్రతిపక్షంగా అసెంబ్లీలోనూ, వీధుల్లోనూ పోరాడేందుకు అవసరమైన పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. రాబోయే రెండేళ్ల కాలానికి కేసీఆర్ నిర్దేశించిన ఈ రోడ్ మ్యాప్ తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

# గన్ వదిలి పెన్ పట్టి...

**కరీంనగర్, మే 16, పెన్ పవర్:**
మాజీ మావోయిస్టు దేవ్‌జీ దాదాపు 40 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారి ఇంటర్మీడియట్ పరీక్ష రాశారు. 1983లో పోలీసుల జోక్యానికి నిరసనగా ఇంటర్ పరీక్షలకు దూరమైన ఆయన.. ఇప్పుడు సామాన్య పౌర జీవితంలో భాగంగా చదువును పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్లలోని పరీక్షా కేంద్రంలో తెలుగు పేపర్ రాసిన దేవ్‌జీ.. భవిష్యత్తులో న్యాయవాదిగా మారి పేదల తరపున పోరాడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.కాలం మారింది.. మార్గమూ మారింది.. కానీ లక్ష్యం మాత్రం సమాజ హితమే అని చాటిచెబుతున్నారు మాజీ మావోయిస్టు నేత దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి. ఒకప్పుడు గన్ చేతబట్టి అడవి బాట పట్టిన ఈ మాజీ మావోయిస్టు ఇప్పుడు తన అసంపూర్ణ విద్యను పూర్తి చేసేందుకు పెన్ను పట్టారు. సరిగ్గా 40 ఏళ్ల క్రితం ఎక్కడైతే తన చదువు ఆగిపోయిందో.. మళ్లీ అక్కడి నుంచే తన కొత్త అధ్యాయాన్ని ప్రారంభించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన దేవ్‌జీ.. 1982–83 ప్రాంతంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. ఆ సమయంలో విప్లవ భావజాలానికి ఆకర్షితుడై రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చురుగ్గా పనిచేశారు. ఆ క్రమంలో ఆయనపై పలు కేసులు నమోదు కావడంతో

చదువుకు ఆటంకం ఏర్పడింది. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాసినప్పటికీ.. తెలుగు సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు. మిగిలిన అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించినా.. విప్లవ పోరాటంలో భాగంగాఅజ్ఞాతంలోకి వెళ్లడంతో మళ్లీ పరీక్ష రాసే అవకాశం చిక్కలేదు.సుదీర్ఘకాలం ఉద్యమంలో కొనసాగి ఇటీవలే జనజీవన శ్రవంతిలోకి వచ్చిన దేవ్‌జీ.. తన విద్యను పూర్తి చేయాలని గట్టిగా నిశ్చయించుకున్నారు.
ఇంటర్ బోర్డు నుంచి ప్రత్యేక అనుమతి పొంది బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఒక ప్రైవేట్ జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రానికి హాల్ టికెట్, ఎగ్జామ్ ప్యాడ్‌తో చేరుకున్నారు. తన కన్నా వయసులో చాలా చిన్నవారైన విద్యార్థులతో కలిసి ఏమాత్రం సంకోచించకుండా తెలుగు పరీక్ష రాశారు.పరీక్ష అనంతరం దేవ్‌జీ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉద్యమంలోకి వెళ్లినప్పుడు తన చదువు ఎక్కడ ఆగిందో.. అక్కడి నుంచే మళ్లీ మొదలు పెట్టాలని అనుకున్నానని చెప్పారు. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత లాసెట్ రాసి న్యాయ విద్యను అభ్యసించాలనుకుంటున్నట్లు వెల్లడించారు. న్యాయవాదిగా మారి సమాజంలోని పేదలకు ఉచితంగా న్యాయ సాయం అందించడమే తన తుది లక్ష్యమని అన్నారు. ఒకప్పటి విప్లవ నేత ఇలా విద్యామార్గంలో ప్రజాసేవకు సిద్ధమవ్వడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.కాగా, గత ఏడాది కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు చాలా మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు. దేవ్ జీ తో పాటు మల్లా రాజిరెడ్డి, ఆశన్న వంటి కీలక నేతలు పలువిడతల్లో పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. ఆ తర్వాత జన జీవన స్రవంతిలో కలిసిపోయి సాధారణ పౌర జీవితం గడుపుతున్నారు. అందులో భాగంగానే తాజాగా.. దేవ్ జీ ఆగిపోయిన తన చదువును కొనసాగించేందుకు ఇంటర్ పరీక్షలు రాశారు.

# గ్రేటర్ పై ధరల భారం..



**హైదరాబాద్, మే 16, పెన్ పవర్:**
కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరల పెంపుదల తెలంగాణ బీజేపీకి ఇబ్బందికరంగా మారనుంది. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఈసారి 300 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. గత ఎన్నికల్లో నలభైకి పైగా స్థానాలను గెలుచుకుంది. కానీ ఈసారి ఆ పరిస్థితి ఉండే అవకాశం లేదు. అయితే ఈ సమయంలో
పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ఈ ప్రభావం ఎన్నికలపై పడుతుందన్న ఆందోళన బీజేపీ నేతల్లో వ్యక్తమవుతుంది. లీటర్ పెట్రోలు, డీజిల్ పై 3.04 రూపాయలు పెరిగింది. హైదరాబాద్ లో పెట్రోలు లీటర్ పెట్రోలు ధర 110.88, లీటరు డీజిల్ ధర 98.96 రూపాయలకు చేరుకుంది. హైదరాబాద్ వంటి నగరాల్లో ఇది భారమనే చెప్పాలి.ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ పెట్రోలు, డీజిల్ ధరల భారం పెనుమార్పులు తేనుంది. నిత్యావసరాల ధరలు పెరగడమే కాకుండా కూరగాయల ధరలు కూడా పెరిగే అవకాశముంది. దాదాపు అన్ని ధరలు పెరగనున్నాయి. బియ్యం నుంచి ఉప్ప వరకూ అన్ని ధరలు పెరిగితే అది సామాన్యుడి అసహనానికి కారణమవుతుంది. ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచారన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఎన్ని పొదుపు సూత్రాలు, మంత్రాలు చెప్పినా ప్రజలకు తమ జేబుల్లో నుంచి డబ్బులు పోతే మాత్రం ఊరికే ఉండరు. తమ అసంతృప్తిని ఓటు రూపంలో ఖచ్చితంగా వెళ్లగక్కుతారన్న ఆందోళన కమలం పార్టీ నేతల్లో కనిపిస్తుంది.ఈ ధరలు పెరుగుదలతో బీజేపీ విజయానికి అడ్డుకట్ట వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయి. అర్ధరాత్రి ..నెల మధ్యలో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడంతో పాటు గ్యాస్ సిలిండర్ ధర కూడా ఇటీవల అరవై రూపాయలు పెరగడంతో ఆ ప్రభావం తమ పార్టీపై పడుతుందేమోనన్న భయం బీజేపీ నేతలకు పట్టుకుంది. సాధారణంగా ప్రతి నెల ఒకటో తేదీన పెట్రో ఉత్పత్తుల ధరలను సమీక్ష చేసే చమురు సంస్థలు నెల మధ్యలోనే నిర్ణయం తీసుకుని జనంపై వీర బాదుడు చేశాయి. అదేమంటే గత నాలుగేళ్ల నుంచి ధరలను పెంచలేదంటూ కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంటున్నప్పటికీ,
పశ్చిమాసియా యుద్ధం ప్రభావం కారణంగా క్రూడాయిల్ ధరలు పెరిగడంతో చమురు సంస్థలు నష్టాల్లో పడ్డాయని అందుకే ధరలను పెంచకతప్పదని గత కొన్ని రోజులుగా లీకులిస్తున్నాయి. ప్రధాని మోదీ తో సహా పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలంటూ పొదుపు మంత్రం పఠించారు.తాజాగా లీటరు పెట్రోలుపై మూడు రూపాయలు, లీటరు డీజిల్ పై మూడు రూపాయలు అదనంగా వడ్డించి ప్రజల నడ్డి విరిచింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు లీటరు పెట్రోలుపై రెండు రూపాయలు తగ్గించి ఓట్లు పొందిన కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగిసిన తర్వాత మూడు రూపాయలు అదనపు భారం వేసింది. దీని వల్ల నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు కూడా పెరగనున్నాయి. ప్రజల కొనుగోలు శక్తిపై కూడా ప్రభావం పడుతుంది. ఆంధ్రప్రదేశ్ లో పెట్రోలు పై 3.29 రూపాయలు, డీజిల్ పై లీటరకు 3.14 రూపాయలు పెంచాయి. తెలంగాణాలో పెట్రోలు, డీజిల్ లీటర్ పై మూడు రూపాయలు పెంచాయి.మెట్రో నగరం కావడంతో ఎక్కువ మంది పెరిగిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఓటెత్తే అవకాశముందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడం బీజేపీ ఆశలకు గండి కొట్టినట్లయిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# టీటీడీపికి తాళం...

**హైదరాబాద్, మే 16, పెన్ పవర్:** ఖ తెలంగాణలో తెలుగుదేశం పార్టీని పూర్తిగా క్లోజ్ చేసినట్లే కనపడుతుంది. మహానాడు వంటి కార్యక్రమాల్లో మాత్రమే తెలంగాణ టీడీపీ నేతలు కనపడుతున్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అనధికారికంగా మూత వేసినట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మరోసారి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి మళ్లీ రావడం టీడీపీ నాయకత్వం ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. 2024లో గెలిచిన తొలినాళ్లలో చంద్రబాబు హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చి టీటీడీపీ నేతలతో సమావేశమై ఇక్కడ పార్టీని బలోపేతం చేస్తామని ప్రకటించారు. కానీ తర్వాత మాత్రం ఆ దిశగా ఎటువంటి చర్యలుచేపట్టలేదు. మహానాడులో మాత్రం తెలంగాణ టీడీపీ నేతలు కనిపించి వెళ్లిపోతున్నారు.మరొకవైపు తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి నియామకం కూడా చేపట్టలేదు. అసలు కార్యవర్గాన్నే నియమించలేదు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ బలంగా ఉండటంతో పాటు తెలుగుదేశం పార్టీపై ఆంధ్ర పార్టీగా ముద్ర పడింది. ఇప్పటికే వైసీపీ అధినేత జగన్ తెలంగాణలో వైసీపీని మూసివేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. కానీ తెలుగుదేశం పార్టీ మాత్రం జాతీయ పార్టీ గా ఉండలని భావించి తెలంగాణలో వరసగా అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తుంది. 2014, 2018 ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేసి తక్కువ స్థానాల్లో విజయం సాధించింది. అయినా గెలిచిన వారు ఎవరూ పార్టీలో ఉండలేదు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఎన్నికలకు వెళ్లింది. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ తెలంగాణను పూర్తిగా వదిలేసినట్లే కనపడుతుంది. చంద్రబాబు హైదరాబాద్ కు వారం వారం వస్తున్నప్పటికీ టీటీడీపీ నేతలతో సమావేశం అయ్యేందుకు సుముఖంగా కనిపించడం లేదు. అందులో ఆంధ్రప్రదేశ్ లో బీజేపీలో టీడీపీ కూటమిగా ఉండటం, తెలంగాణలో మాత్రం బీజేపీ టీడీపీతో పొత్తుకు అంగీకరించకపోవడంతో ఇక్కడ సైకిల్ పార్టీని పూర్తిగా గాలికి వదిలేసింది. ఉన్న కొద్దోగొప్పో ఓటు బ్యాంకు ఇతర పార్టీలకు తరలి వెళ్లాయి. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేసే అవకాశం లేదు. దీంతో టీడీపీ తెలంగాణ శాఖ దాదాపుగా మూసివేసినట్లేనన్న సంకేతాలను పార్టీ నాయకత్వం ఇచ్చిందనే చెప్పాలి.

## కోదాడ లో "బడిబాట"

**కోదాడ, మే 16: పెన్ పవర్:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం "బడిబాట" (ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట) కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినులు కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో లభించే నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన పథకం మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన వంటి వసతులను వివరించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, బడి వయసు పిల్లలు ఎవరూ బయట ఉండకుండా చూడాలని కోరారు.

**టాపర్లకు అభినందనల జల్లు:**
ఇదే వేదికపై, ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటిన విద్యార్థినులు కట్టికోల పూజశ్రీ మరియు మాలవతు పవిత్రలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు తోటి విద్యార్థినులు ఘనంగా అభినందించారు. వారి ప్రతిభ మిగిలిన విద్యార్థినులకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కూడా కార్పొరేట్ సంస్థలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని ఈ విద్యార్థినులు నిరూపించారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## హోటల్లో అగ్ని ప్రమాదం..తప్పిన ప్రాణ నష్టం

**సికింద్రాబాద్. పెన్ పవర్:** రెజిమెంటల్ బజార్ మెట్రో పాలిస్ హోటల్ లో తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంబంధించినది. ఈ హోటల్లోని మూడవ అంతస్తులో ఉన్న వంట గదిలో నుండి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి పక్కనే ఉన్న రెస్టారెంట్ కు వ్యాపించడంతో అగ్ని ప్రమాద తీవ్రత పెరిగింది.మంటల తీవ్రత వేడి కారణంగా, వంటగదిని ఆనుకుని ఉన్న భోజనశాల అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిమాపక సిబ్బంది మంటలు మిగిలిన అంతస్తులకు భవనంలోని ప్రక్క భాగాలకు వ్యాపించకుండా నివారించారు. ఈ హోటల్లో బస చేస్తున్న 67 మంది ఈ అగ్ని ప్రమాద ఘటనకు భయాందోళనకు గురికాగా వారిని హైడ్రాలిక్ ప్లాట్ఫామ్ వెహికల్ బ్రాంటో స్కైలిఫ్ట్ ద్వారా సురక్షితంగా కాపాడినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యుతఘాథం మూలంగానే అగ్నిప్రమాదం సంభవించిందని అగ్నిమాపక అధికారులు భావిస్తున్నారు.

## కోదాడ గణపవరం గ్రామంలో హత్య కలకలం

**కోదాడ: పెన్ పవర్:** గణపవరం గ్రామంలో గణేష్ చదువు రీత్యా బెంగళూరులో ఉంటూ చదువైన తర్వాత బెంగళూరులో జాబ్ చేస్తూ న్నాడు. సెలవులు నిమిత్తం తన గ్రామానికి వచ్చి మూడు రోజులు అయితుండగా తన స్నేహితుడు మ్యారేజ్ ఫంక్షన్ కి రాత్రి 8 గంటల సమయంలో వెళ్లి మరల తన స్నేహితులతో కలిసి కనిపించాడు. తరువాత కనిపించకుండా పోయాడు. గణేష్ కనిపించకపోవడంతో బంధువులు పోలీస్ కంప్లైంట్ ఇచ్చారు. గణేష్ మృతదేహం లక్ష్యం పురం గ్రామం రోడ్డుకి మామిడి తోటలో ఉందని రైతు చూసి గ్రామస్తులకు తెలియజేశాడు. గణేష్ ఒంటిపైన కత్తి పోట్లు, మెడపైన కత్తి తోటి పొడిచి ఒంటి మీద ఉన్న బట్టలన్నీ తీసేసి అతి కిరాతకంగా చంపినట్లు పోలీసులు గుర్తించారు.

## కరీంనగర్ పార్లమెంట్ పరిధి కాంగ్రెస్ పార్టీ నేతలతో మంత్రి పొన్నం భేటి

**హైదరాబాద్: పెన్ పవర్:** మినిస్టర్ క్వార్టర్స్ లో కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం నాడు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ఇంచార్జి లు, అబ్జర్వర్ల తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్,ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ,కరీంనగర్ డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ,ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ , కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు అంజన్ కుమార్ ,కెకె మహేందర్ రెడ్డి ,ఒడితల ప్రణవ్ నియోజకవర్గ కోఆర్డినేటర్స్ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, దుధం వెంకట రమణ , బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మహమ్మద్ ఖాజా ఫక్రుద్దీన్, ఆదేం రాజ్ దేఖపతి,సౌజన్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ సంస్థాగత అభివృద్ధి పై చేయాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు కార్యక్రమాలు ప్రజల్లోకి వృస్థంగా తీసుకెళ్లడం లాంటి అంశాలు, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో డిసిసి అధ్యక్షులు మండలాల వారిగా పార్టీ సమావేశాలు ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చ జరిగింది.
ఓటరు జాబితా సవరణ పై నియోజకవర్గ ఇంచార్జి లు ,కోఆర్డినేటర్ లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నియోజకవర్గాల వారిగా వరి ధాన్యం కొనుగోలు లో ఇబ్బందులు లేకుండా పార్టీ నేతలు క్రియాశీలకంగా పని చేయాలి. పార్టీలో ముందు నుండి క్రియాశీలంగా ఉన్న వారికి గుర్తింపు ఇవ్వాలి. నామినేటెడ్ పార్టీ పదవుల్లో పార్టీ నిర్ణయించిన విధంగా మూడు సంవత్సరాలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సూచించారు.

# పవన్ కు ఇన్ని ఆరోగ్య సమస్యలా

**హైదరాబాద్ పెన్ పవర్:** సైనస్ ఆపరేషన్ కారణంగా గత కొంత కాలం నుండి విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ , నేడు తొలిసారి మీడియా ముందుకు వచ్చాడు. జనసేన పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం లో పాల్గొన్న ఆయన , నేడు మాట్లాడిన కొన్ని మాటలు ఇప్పుడు సోషల్ మీడియా అంతటా బాగా వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఉద్యమి సభ్యత్వాలను అత్యధిక శాతం చేయించిన కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించాడు. ఇదంతా పక్కన పెడితే , తన ఆరోగ్య పరిస్థితి పై పవన్ కళ్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానులను కాస్త ఆందోళనకు గురి చేస్తోంది. ఇన్ని సమస్యలను పెట్టుకొని ఒక పక్క సినిమాలు , మరోపక్క రాజకీయాలు ఎలా మ్యానేజ్ చేస్తున్నావ్ అన్నా అని ఆయన అభిమానులు సోషల్ మీడియా లో కామెంట్స్ చేస్తున్నారు. ఇంతకీ పవన్ కళ్యాణ్ ఏమి మాట్లాడాడో ఒకసారి చూద్దాం.ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుతానికి నా ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఎన్నికల సమయం లో బాగా తిరగడం తో పాటు , నాకు కరోనా వచ్చినప్పుడు ఏర్పడిన లంగ్ ఇన్ఫెక్షన్ అలాగే ఉండిపోయింది. ఆ తర్వాత దుమ్ము , ధూళి లో తిరగడం వల్ల , సైనస్ ప్రాంతాల్లో ఆ డస్ట్ బాగా గట్టి పడింది, అది కాలక్రమేణా వాచిపోయేలా చేసింది. ఆ కారణం చేత ఒక రోజు నా కళ్ళు కనిపించకుండా పోయింది. ఈ కారణాల చేత భీమవరం లో ఒక ప్రోగ్రాం ఉన్నప్పటికీ క్యాన్సిల్ చేసి , హైదరాబాద్ కి వెళ్లి , ఇవన్నీ సరిచేసుకొని రావడానికి ఒక నెల రోజుల సమయం పట్టింది. డాక్టర్లు నా రెండు భుజాల మధ్య కూడా టెర్ వచ్చేసిందని అన్నారు. ఎందుకు ఇలా వచ్చింది అని డాక్టర్లు అడగ్గా, క్యాంపైన్ కి వెళ్ళినప్పుడు అభిమానులు చేతులు పట్టుకొని లాగేస్తుంటారు , కన్దతెగిపోయేంత లాగేస్తారు' అంటూ చెప్పుకొచ్చాడు. ఆయన మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియో ని మీకోసం క్రింద అందిస్తున్నాము చూడండి. ప్రస్తుతానికి పవన్ కళ్యాణ్ కి ఎలాంటి ఆరోగ్య సమస్య లేదు అనేది స్పష్టమైంది , రాబోయే రోజుల్లో ఆయన సినిమాలను , రాజకీయాలను ఎలా బ్యాలన్స్ చేస్తాడో చూడాలి.

# నీట్ లీక్ ఎఫెక్ట్... అన్నీ పరీక్షలపై ప్రభావం

**హైదరాబాద్, మే 16, పెన్ పవర్:** నీట్ కౌన్సెలింగ్ తర్వాతే పలు ఇతర కోర్సుల ప్రవేశాలు జరపాల్సి ఉండటంతో యేటా విద్యా సంవత్సరం గాడి తప్పుతోంది. ఈ క్రమంలో ఈఏపీసెట్ ఫలితాలు మే నెలలోనే వెలువడినా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు అక్టోబరు వరకు వేచి చూడాల్సి వస్తోంది. అన్ని పరీక్షలు సకాలంలో పూర్తయితేనే ఈఏపీసెట్ పరిస్థితి ఇలా ఉంది. ఇక ఈ ఏడాది నీట్ పరీక్ష రద్దు అవడంతో పలు ప్రవేశాల ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.గత ఏడాది మే 4న నీట్ నిర్వహించగా.. జూన్ 14న ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా నీట్ ర్యాంకు ఆధారంగా రాష్ట్ర ర్యాంకు కేటాయిస్తారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ మొదలవుతుంది. రాష్ట్ర నీట్ కౌన్సెలింగ్ రెండు, మూడు దఫాలు పూర్తయిన తర్వాత ఈఏపీసెట్ అగ్రికల్చర్ విభాగం ప్రవేశాలు మొదలుపెడుతుంది. కాళోజీ హెల్త్ వర్సిటీల ఆధ్వర్యంలో తొలుత నీట్ కౌన్సెలింగ్ ఆ తర్వాత వెటర్నరీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలు జరుపుతారు. చివరగా బీఫార్మసీ, ఫార్మా–డి కౌన్సెలింగ్ మొదలవుతుంది. గత ఏడాది నీట్ సవ్యంగా జరిగితేనే ఫార్మా కౌన్సెలింగ్ అక్టోబరు 5న మొదలైంది. చివరి విడత కౌన్సెలింగ్ అక్టోబరు 23తో పూర్తయింది. ఈ సారి నీట్ రద్దు కావడంతో ఈ ప్రవేశాలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇక బీ ఫార్మసీ, ఫార్మా–డి కోర్సులకైతే నవంబరు వరకు ప్రవేశాలకు ఎదురు చూడాల్సిందే.ఈ కౌన్సెలింగ్‌లు అన్నీ ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉండటంతోనే ఈ జాప్యం నెలకొంటుంది. ఒక కోర్సులో చేరిన తర్వాత డిమాండ్ ఉన్న మరో కోర్సులో సీటు వస్తే.. తొలుత సీటు పొందిన కాలేజీలు ఫీజు, సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వడం లేదు. దీంతో ఆ ఫీజును వదులు కోవడమో.. మెరుగైన సీటు కోల్పోవడమో జరుగుతుంది. అందుకే విద్యాశాఖ అధికారులు సైతం ఒక కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మరొకటి నిర్వహిస్తూన్నారు. ఈసారి మళ్లీ నీట్ నిర్వహించి, ఫలితాలు వెల్లడించడానికి కనీసం 2 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఆ ప్రకారంగా చూస్తే ప్రవేశాల కౌన్సెలింగ్‌లు మరింత ఆలస్యమవుతాయి. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటే తప్ప కొత్త విద్యాసంవత్సరం కొలిక్కిరాదని నిపుణులు భావిస్తున్నారు.

# తెలంగాణలో సర్ చిచ్చు

**హైదరాబాద్, పెన్ పవర్::** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' చిచ్చు రేపుతోంది. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియ ఇప్పుడు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య యుద్ధానికి దారితీసింది. అయితే, ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ వహిస్తున్న మౌనం రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీస్తోంది.ఓటరు జాబితాలో బోగస్ ఓట్లు, డూప్లికేట్ ఎంట్రీలను తొలగించడమే 'సర్' లక్ష్యమని కేంద్రం చెబుతున్నా, బీజేపీయేతర పార్టీలు మాత్రం దీనిని ఒక రాజకీయ ఆయుధంగా చూస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ తీవ్ర వివాదాలకు కేంద్ర బిందువైంది. పశ్చిమ బెంగాల్లో లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ముఖ్యంగా అక్రమ వలసదారుల పేరుతో మైనార్టీ వర్గాల ఓట్లు గల్లంతు చేశారని, తద్వారా బీజేపీ లబ్ధి పొందిందనే వాదన బలంగా వినిపించింది.బీహార్ లో కూడా ఆర్జేడీ, కాంగ్రెస్ వంటి పార్టీలు సర్ విధానాన్ని వ్యతిరేకించాయి. పారదర్శకత లేని తొలగింపులు ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని విమర్శించాయి. ఈ రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు వీధుల్లోకి వచ్చి పోరాడితే, తెలంగాణలో పరిస్థితి భిన్నంగా ఉంది.టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ను కలిసి ా×=పై తన అభ్యంతరాలను వ్యక్తం చేసింది. పౌరసత్వ చట్టాన్ని సాకుగా చూపి మైనార్టీల ఓట్లను తొలగించవద్దని, 14 రకాల గుర్తింపు కార్డుల్లో దేనిని చూపించినా ఓటరుగా గుర్తించాలని కోరింది. నిజామాబాద్, భైంసా, బోధన్ వంటి ప్రాంతాల్లో మైనార్టీ ఓట్లు ఎక్కువగా ఉండటంతో, అక్కడ 'సర్' ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది.దేశవ్యాప్తంగా బీజేపీయేతర పక్షాలు 'సర్'పై గళమెత్తుతుంటే, బీఆర్ఎస్ మాత్రం ప్రేక్షక పాత్రకు పరిమితమైంది. దీని వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి. మైనార్టీల ఓట్ల కోసం 'సర్'ను వ్యతిరేకిస్తే, మెజారిటీ హిందూ ఓటర్లలో వ్యతిరేకత వస్తుందని కేసీఆర్ భావిస్తున్నారనే సందేహం కలుగుతోంది. ఇప్పటికే మైనార్టీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో, ఇప్పుడు వారి కోసం పోరాడి ఉన్న హిందూ ఓట్లను పోగొట్టుకోవడం ఎందుకని బీఆర్ఎస్ భావిస్తుండవచ్చు. ఇటీవల ప్రధాని మోడీ పర్యటనపై కూడా బీఆర్ఎస్ పెద్దగా స్పందించలేదు. 'సర్' వంటి విధానపరమైన అంశాల్లో బీజేపీని విమర్శించకపోవడం ద్వారా, కేంద్రంతో సన్నిహితంగా ఉండాలని చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పాతబస్తీ వంటి చోట్ల ఎంఐఎం బలంగా ఉంది. అక్కడ ఓట్లు తొలగించినా ఎంఐఎంకే నష్టం తప్ప తమకేమీ కాదనే ధీమా కూడా బీఆర్ఎస్‌లో ఉండవచ్చు.ఒకవైపు కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి ఎన్నికల సంఘం చుట్టూ తిరుగుతోంది. ఎంఐఎం తనదైన శైలిలో పోరాటానికి సిద్ధమవుతోంది. కానీ, రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ వంటి పార్టీ, ఇంతటి కీలకమైన అంశంపై నోరు విప్పకపోవడం ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తోంది. ఓటర్ల తొలగింపు ప్రక్రియ పూర్తయ్యాక, తుది జాబితా వచ్చాక కూడా బీఆర్ఎస్ ఇదే మౌనాన్ని కొనసాగిస్తే.. ఆ పార్టీ కేవలం రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల ఓటు హక్కుపై ఆసక్తి లేదని స్పష్టమవుతుంది.బీఆర్ఎస్ మౌనం.. బీజేపీకి పరోక్షంగా సహకరించడమే అవుతుందనే విమర్శలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆ పార్టీ నాయకత్వంపై ఉంది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో 'సర్' చుట్టూ జరుగుతున్న ఈ లొల్లి, రాబోయే ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చేలా కనిపిస్తోంది.

# కేబినెట్ రీ లోడింగ్ టెన్షన్...

**హైదరాబాద్, మే 16 పెన్ పవర్:**తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి కళ్లు సచివాలయం వైపే ఉన్నాయి. ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు పూర్తయిన తరుణంలో, ముఖ్యమంత్రి తన కేబినెట్‌ను ప్రక్షాళన చేసేందుకుసిద్ధమవుతున్నారనే వార్తలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, పనితీరు ఆధారంగా మంత్రుల శాఖలను మార్చడం లేదా కొందరిని తప్పించడంవంటి కఠిన నిర్ణయాలు హైకమాండ్ తీసుకోబోతోందని తెలుస్తోంది. దీంతో రాష్ట్ర మంత్రుల్లో ఒకరకమైన అభద్రతా భావం, ఉత్కంఠ నెలకొన్నాయి.ప్రభుత్వ పనితీరును పరుగులు పెట్టించాలనే లక్ష్యంతోఅధిష్టానం ఇప్పటికే మంత్రులందరి ప్రగతి నివేదికలను తెప్పించుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా కీలకమైన రెవెన్యూ, హోం, విద్యుత్ వంటి శాఖల పనితీరుపై మిశ్రమ స్పందన వస్తోంది. ప్రజల్లో ఉన్నఅసంతృప్తిని తగ్గించడానికి, ఎన్నికల హామీల అమలులో వేగం పెంచడానికి సమర్థులైన వారికి కీలక బాధ్యతలు అప్పగించాలని సీఎం భావిస్తున్నారు. కొన్ని శాఖలు ఇప్పటికీ ముఖ్యమంత్రి వద్దే ఉండటం వల్ల పాలనాపరమైన జాప్యం జరుగుతోందన్న విమర్శలను చెరిపివేసేందుకు పూర్తి స్థాయి క్యాబినెట్ దిశగా అడుగులు పడుతున్నాయి.ఈ పునర్వ్యవస్థీకరణ వార్త సీనియర్ మంత్రులను కలవరపెడుతోంది.తాము గత 30 నెలలుగా ఒక శాఖపై పట్టు సాధించి, క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని గాడిలో పెట్టామని, ఇప్పుడు శాఖ మార్చితే మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని కొందరు సీనియర్లువాదిస్తున్నారు. తమ శాఖలను మార్చవద్దని ఇప్పటికే అధిష్టానానికి, ముఖ్యమంత్రికి మొరపెట్టుకున్నట్లు సమాచారం. మరోవైపు, ప్రస్తుతం ప్రాధాన్యత లేని శాఖల్లో ఉన్న మంత్రులు మాత్రం తమకుఈసారైనా మెరుగైన బాధ్యతలు దక్కుతాయని ఆశగా ఉన్నారు. ముఖ్యంగాయాక్టివ్‌గా ఉంటూ పార్టీ వాయిస్‌ను బలంగా వినిపిస్తున్న వారికి ప్రమోషన్ దక్కే అవకాశం కనిపిస్తోంది.ఈ ప్రక్షాళనలో కేవలంపనితీరు మాత్రమే కాకుండా రాజకీయ, సామాజిక సమీకరణాలు కీలక పాత్ర పోషించనున్నాయి.

# పెట్రోల్ వినియోగం లో గోవా టాప్...

**హైదరాబాద్, మే 16, పెన్ పవర్:**
అంతర్జాతీయి చమురు సంక్షోభం నేపథ్యంలో ఇంధన ధరల పెరుగుతున్నాయి. పీపీఏసీ 2024--25 డేటాను పరిశీలిస్తే మన దేశంలో ప్రతి 100 మందికి రోజుకు సగటున 10.4 లీటర్ల పెట్రోల్ వినియోగం జరుగుతోంది. గతేడాది లీటర్లుగా ఉండేది. కార్ల సంఖ్య పెరగడంతో వినయోగం పెరిగింది. అయితే రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం ఆర్థిక అసమానతలు ఉన్నాయి.పెట్రోల్ వినియోగంలో గోవా మొదటి స్థనంలో ఉంది. ఇక్కడ సగటున వారానికి ఒకరు 52 లీటర్ల పెట్రోల్ వినియోగిస్తాడు. ఇక్కడ 70 శాతం ఇంధన డిమాండ్ ఉంది.తర్వాత మరో మూడు రాష్ట్రాలు వరుసగా పుదుచ్చేరి, చండీగఢ్ 41 లీటర్లు, లద్దాక్ 37 లీటర్లు, అరుణాచల్ ప్రదేశ్ 27 లీటర్లు ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్ (21 లీటర్లు వినియోగిస్తుంది. తెలంగాణ 17 లీటర్లతక్ష 10వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 11లీటర్ల వినియోగంతో 22వ రాష్ట్రంగా నిలిచింది.చిన్న రాష్ట్రాల్లో టూరిజం, ప్రైవేట్ వెహికల్స్ (పెట్రోల్ కార్లు 80 శాతం) వల్ల వినియోగం ఎక్కువ. తెలంగాణ--ఆంధ్రల్లో మిక్స్‌డ్ ఎకానమీ (2--వీలర్లు 70 శాత, పబ్లిక్ ట్రాన్స్ 20 శాతం) మధ్యస్థ స్థాయి. బిహార్ వంటివి (గ్రామీణ ప్రాంతాలు, సైకిల్/బైక్ ఆధారిత రవాణా (పెట్రోల్ కార్లు 5 శాతం)తో తక్కువ. మొత్తం దేశ వినియోగం 3.5 కోట్ల లీటర్లు. ఆర్థిక, పర్యావరణ, పాలసీ ఒత్తిడి.. భారీగా పెట్రోలియం వినియోగంతో రూ.1.5 లక్షల కోట్ల చెల్లించాల్సి వస్తోంది.కాలుష్యం తగ్గించేందుకు పెట్రోల్‌లో 25 శాతం ఇథనాల్ కలపాలని కేంద్రం నిర్ణయించింది. హై--కనరీ?స్యమ్ రాష్ట్రాల్లో ఎయిర్ పొల్యూషన్ 30 శాతం ఎక్కువ. ధనిక రాష్ట్రాల్లో కార్ కల్చర్, పబ్లిక్ ట్రాన్స్ ఆధారం ఇది రీజనల్ డివైడ్‌ను పెంచుతోంది.ఒక వ్యక్తి సగటున వారానికి 10.4 లీటర్లు ఒక హెచ్చరికే. ఇంధన భద్రత, పర్యావరణ లక్ష్యాల దృష్ట్యా వినియోగం తగ్గించాలి. ప్రాంతీయ సమతుల్యతకు డ్రైవర్. ప్రభుత్వాలు రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగితే మనదేశం ఎనర్జీ--స్మార్ట్ నేషన్‌గా మారుతుంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పెట్రోల్ భారం....రోజువారీ వస్తువులపై ప్రభావం

**హైదరాబాద్, మే 16, పెన్ పవర్:**
పెట్రోల్, డీజిల్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో వాహనదారులపై భారం పడింది. లీటరు పెట్రోల్‌పై రూ.3.14, డీజిల్‌పై రూ.3.11 చొప్పున పెంచుతూ చమురు కంపెనీలు తీసుకున్న అమల్లోకి వచ్చింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హర్మూజ్ జలసంధిలో రాకపోకలకు అంతరాయం, ఖర్చులు పెరగడం ఈ పెంపునకు ప్రధాన కారణంగా మారింది.అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నప్పటికీ, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు గత 11 వారాలుగా ఇంధన ధరలను పెంచకుండా స్థిరంగా కొనసాగించాయి. అయితే, పెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకోలేక చివరకు సామాన్యులపై ఈ భారాన్ని మోపక తప్పలేదని కంపెనీలు పేర్కొన్నాయి. గత కొంతకాలంగా ఏ పెరుగుదల గురించి అయితే ఆందోళన వ్యక్తం చేస్తున్నారో అదే జరిగింది. వాస్తవానికి 2022 ఏప్రిల్ నుంచి ఇంధన ధరల్లో పెద్దగా మార్పులు లేవు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు మాత్రం లీటరుకు రూ.2 చొప్పున కేంద్రం తగ్గించింది.ఇటీవల అంతర్జాతీయ ఉద్రిక్తతల కారణంగా దేశంలో పెట్రో ధరలు పెరుగుతాయని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అయితే దేశంలో సరిపడా నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పట్లో భరోసా ఇచ్చింది. ప్రభుత్వం ఆ ప్రకటనలు చేసిన కొద్ది రోజులకే ఇప్పుడు ధరలు పెరిగాయి. ఈ తాజా పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ప్రభావం చూపి, పలు రంగాలపై ప్రభావం చూపుతుందని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.ఇంధన ధరలు పెరగడం వల్ల ప్రభావం కేవలం వాహనాలకే పరిమితం కాదు. రవాణా ఖర్చులు పెరగడంతో కూరగాయలు, పాలు, రేషన్, ఆన్‌లైన్ డెలివరీ, బస్సు, ఆటో ఛార్జీలు, రోజువారీ అవసరమైన అనేక వస్తువుల ధరలు పెరుగుతాయి. ఖర్చులు పెరగడంతో రాబోయే రోజుల్లో ఇంటి బడ్జెట్ మరింత పెరిగి సామాన్యుడు ఇబ్బంది పడతాడు. కొన్ని రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలకు లిమిట్ విధించి విక్రయాలు జరుపుగుతున్నారు.పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో మొదట రోజువారీ ఉపయోగించే వస్తువులపై ప్రభావం కనిపిస్తుంది. పండ్లు, కూరగాయలను పొలాల నుండి మార్కెట్లకు చేరవేయడానికి రవాణా ఖర్చు పెరుగుతుంది. దీనివల్ల వాటి ధరలు పెరుగుతాయి. పాలు, ఇతర డైరీ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పెట్రోల్–డీజిల్ ధరలు వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేయవచ్చు. ఇంధన ధరలు పెరగడం

వల్ల ట్రావెలింగ్ ఖర్చులు పెరుగుతాయి. ఆటోలు, ప్రైవేట్ వాహనాలతో పాటు సరుకు రవాణా ఖర్చులు పెరుగుతాయి. దాంతో అది పలు రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడు కంపెనీలు ఛార్జీలను పెంచుతాయి. దీంతో పాటు స్కూల్ బస్సు, ఆటోలు సైతం రేట్లు పెంచుతాయి. పిల్లల ట్రాన్స్‌పోర్ట్ ఫీజులు తల్లిదండ్రులకు మరింత బారం కానున్నాయి. తాజా నిర్ణయం కారణంగా ఉబర్, ఓలా, ర్యాపిడో బుకింగ్ ధరలు అమాంతం పెంచే అవకాశం ఉంది.పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల ఆన్‌లైన్ సేవలపై కూడా పడవచ్చు. అమెజాన్ , ఫ్లిప్‌కార్ట్, జొమాటో, స్విగ్గీ వంటి కంపెనీలు డెలివరీ ఛార్జీలను పెంచుతాయి. లగేజీ, పార్సిల్స్ పంపే కొరియర్ సేవల ధరలు పెరిగే అవకాశం ఉంది.

# మే చివరి నాటికే నైరుతి రుతుపవనాల ఎంట్రీ

**హైదరాబాద్, మే 16, పెన్ పవర్:**
తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ఐదు రోజులు ముందుగానే.. అంటే మే 26 నాటికే కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని ప్రకటించింది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇది మే 22 నుంచి 30 మధ్య మారవచ్చునని పేర్కొంది. ఈ లెక్కన తెలంగాణను జూన్ 1 లేదా 2వ తేదీల్లో రుతుపవనాలు పలకరించనున్నాయి. అయితే ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి వర్షపాతం సాధారణం కంటే కొంచెం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.మాడు పగిలే ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ విభాగం ఎట్టకేలకు చల్లని కబురు చెప్పింది. దేశ వ్యవసాయ రంగానికి వెన్నెముక లాంటి నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది షెడ్యూల్ కంటే ముందే దేశంలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకే రుతుపవనాలు.. ఈసారి ఐదు రోజులు ముందుగానే అంటే మే 26 నాటికే కేరళను తాకే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. వాతావరణంలో వస్తున్న మార్పుల ఆధారంగా మే 22 నుంచి మే 30 మధ్య కాలంలో ఎప్పుడైనా ఇవి కేరళ తీరాన్ని తాకవచ్చని స్పష్టం చేసింది. తెలంగాణకు సైతం రుతుపవనాల రాక ముందస్తుగానే ఉండబోతోంది. సాధారణంగా కేరళ తీరాన్ని తాకిన ఐదు రోజుల తర్వాత రుతుపవనాలు రాయలసీమ మీదుగా దక్షిణ తెలంగాణ జిల్లాల్లోకి ప్రవేశిస్తాయి. గతేడాది వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే.. మే 24న కేరళను తాకిన రుతుపవనాలు మే 31 నాటికి తెలంగాణను పలకరించాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం.. ఈ ఏడాది జూన్ 1 లేదా రెండో తేదీ నాటికే తెలంగాణవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ముందస్తు రుతుపవనాల రాకతో తీవ్రమైన ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు, సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులకు పెద్ద ఊరట లభించినట్లయింది.అయితే, వర్షపాతం విషయంలో వాతావరణ శాఖ ఒక కీలక హెచ్చరికను కూడా జారీ చేసింది. ఈ ఏడాది రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే కొంచెం తక్కువగా వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ఐఎండీ అభిప్రాయపడింది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఎల్ నినో పరిస్థితులే దీనికి ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. సాధారణంగా ఈ వర్షాకాలంలో సగటున 80 సెంటీమీటర్ల వర్షపాతం కురిసే అవకాశం ఉండగా.. 1971–2020 మధ్య కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు 87 సెంటీమీటర్లుగా ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ.. ముందస్తు రుతుపవనాల రాక సాగు పనులకు సానుకూలంగా మారుతుందని నిపుణులు భావిస్తున్నారు.మరోవైపు.. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండల తీవ్రత గరిష్ట స్థాయికి చేరింది. శుక్రవారం పగటిపూట అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలో 44.5 డిగ్రీల సెల్సియస్ రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అయితే, ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో శనివారం ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# దూరమౌతున్న అనురాగం కేటీఆర్, హరీష్ మధ్య గ్యాప్

**హైదరాబాద్, మే 16 పెన్ పవర్:**
తెలంగాణలో అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి ఉడికీ ఉడకని చందంగా తయారైంది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై ప్రజా పోరాటాలు నిర్మించడంలో పార్టీ విఫలమవుతోందనే వాదన క్యాడర్‌లో బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా పార్టీ అధినేత కేసీఆర్ క్రియాశీల రాజకీయాలకు కొంత దూరంగా ఉన్న సమయంలో, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నాయకత్వంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత దూషణలకు, సోషల్ మీడియా వేదికగా సాగే మాటల యుద్ధానికే కేటీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని, దీనివల్ల పార్టీకి ఆశించిన మైలేజీ రావడం లేదని అభిప్రాయపడుతున్నారు.పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఎప్పుడూ ముందుండే ట్రబుల్ షూటర్ హరీష్ రావు పాత్ర ఇప్పుడు బీఆర్ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయాలన్నా, చెల్లాచెదురవుతున్న క్యాడర్‌ను ఏకం చేయాలన్నా హరీష్ రావుకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని మెజారిటీ శ్రేణులు కోరుకుంటున్నాయి. అయితే, పార్టీలో కేటీఆర్ వర్గానికి, హరీష్ వర్గానికి మధ్య సాగుతున్న కోల్డ్ వార్ వల్ల ఆయనకు తగిన ప్రాధాన్యత లభించడం లేదనే అసంతృప్తి హరీష్ అనుచరుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు విషయంలో బీఆర్ఎస్ అనుసరించిన వైఖరి పార్టీలో చీలికను తెచ్చింది. రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తిగత అంశాలను అస్త్రంగా చేసుకోవడం పార్టీ ప్రతిష్టను




దిగజారుస్తుందని హరీష్ రావు భావించినట్లు తెలుస్తోంది. అందుకే ఆ విషయంలో ఆయన మౌనం వహించడమే కాకుండా, తన కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకల పేరుతో అమెరికా పయనమయ్యారు. రాజకీయ సెగలు గరిష్ట స్థాయిలో ఉన్నప్పుడు ఆయన విదేశాలకు వెళ్లడం, అది కూడా కొన్నాళ్ల పాటు అక్కడే ఉంటానని చెప్పడం వెనుక వ్యూహాత్మక మౌనం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఒకప్పుడు కేసీఆర్ మాటే శాసనంగా నడిచిన పార్టీలో, ఇప్పుడు నాయకత్వ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. కేటీఆర్ శైలి కేవలం పట్టణ ఓటర్లను, సోషల్ మీడియాను ఆకట్టుకునేలా ఉందే తప్ప, గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ అనిశ్చితిని గమనిస్తున్న ద్వితీయ శ్రేణి నాయకత్వం తమ రాజకీయ భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయాల వైపు చూస్తోంది.బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్‌కేవలం ప్రత్యర్థులను ట్రోల్ చేయడానికే పరిమితమైందని, ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మార్చుకునే కార్యాచరణ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. చెబుతున్నారు. హరీష్ రావు అమెరికాపర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాతే పార్టీలో అసలు రంగు బయటపడుతుందని భావిస్తున్నారు. ఆయన తిరిగి వచ్చాక పార్టీ పగ్గాల్లో మార్పులు ఉంటాయా? లేక ఆయన తన దారి తానుచూసుకుంటారా? అనే చర్చ ఇప్పుడు వెబ్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ ఇప్పుడు ఒక కూడలిలో నిలబడింది. కేసీఆర్ మళ్లీ రంగంలోకి దిగి నాయకత్వ మార్పులపై స్పష్టత ఇస్తే తప్ప,గందరగోళంలో ఉన్న క్యాడర్‌ను గట్టెక్కించడం కష్టమేనని కనిపిస్తోంది. అమెరికా నుంచి హరీష్ రావు తిరిగి వచ్చేలోపు తెలంగాణ రాజకీయాల్లో ఇంకెన్ని మలుపులు చోటుచేసుకుంటాయో వేచి చూడాలి.

# టీడీపీ కొత్త ప్రచారం

**ఒంగోలు, మే 16 పెన్ పవర్:**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరిశీలించిన తర్వాత ఏపీలో అనేక మార్పులు వస్తాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా గత ప్రభుత్వాల పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన పార్టీలకు మాత్రమే తమిళనాడు అసెంబ్లీలో చోటు దక్కింది. కానీ ఏపీ విషయానికి వచ్చేసరికి గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను జగన్ వచ్చిన తర్వాత 2019 -24 మధ్య రద్దు చేశారు. వీటిలో ప్రధానంగా అన్నా క్యాంటీన్, షాదీ ముబారక్ వంటి కీలక పథకాలు ఉన్నాయి. అదే విధంగా ఉన్నత విద్యను అభ్యసించే వారికి విదేశాలకు వెళ్లే సదుపాయాన్ని కూడా దాదాపు తీసేశారు. ఇవన్నీ వైసీపీ ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. అదే సమయంలో టిడిపికి అనుకూల ఓటు బ్యాంకు ను పెంచాయి. దీనిని గమనించిన చంద్రబాబు వైసీపీ అమలు చేసిన పథకాలను కొనసాగిస్తామని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అలాగే వాటిని కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు అమ్మబడి పేరుతో వైసిపి హయంలో అమలు చేసిన పథకాన్ని తల్లికి వందనం పేరుతో మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లారుఅదే విధంగా రైతు భరోసా పేరుతో వైసిపి అమలు చేసిన పథకాన్ని అన్నదాత సుఖీభవ పేరుతో అమలు చేస్తున్నారు. అదే సమయంలో అన్న క్యాంటీన్లను తిరిగి తెరిచారు. రాష్ట్రవ్యాప్తంగా వీటిని మరింత పెంచాలని కూడా భావిస్తున్నారు. వీటికి తోడు విదేశీ రుణాలు, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా పునరుద్ధరించారు. ఇక ఇప్పుడు వైసీపీ పరిస్థితి ఏంటి అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. టిడిపి అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తారా అంటే తమ విధానాలు తమకు ఉన్నాయని ఇటీవల బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి టిడిపి అమలు చేస్తున్న పథకాలు వైసీపీ వస్తే తీసేసే ప్రమాదం ఉందన్నది స్పష్టమవుతుంది. ఇది ఎన్నికల సమయంలో స్పష్టంగా ఆ పార్టీకి ఇబ్బందికర పరిణామాలు సృష్టించడం ఖాయం అవుతుంది. వీటిని టార్గెట్గా చేసుకుని టిడిపి ఇప్పుడు ప్రచారం చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం అమలవుతున్న పథకాలను వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలిస్తే పూర్తిగా రద్దు చేస్తుందని ప్రధానంగా మహిళలకు ఉచితంగా అమల్లోచేస్తున్న బస్సు ప్రయాణాలు రద్దవుతాయని చెప్పనుంది. అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలను కూడా రద్దు చేస్తారని ప్రచారం చేయాలని టిడిపి నిర్ణయించింది. తద్వారా వైసిపిని అడ్డుకునేందుకు సాధ్యమైనన్ని వ్యూహాలను అమలు చేయాలని టిడిపి నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. మహానాడు వేదికగా దీనికి సంబంధించి ప్రకటన చేయనున్నారు. ఎలా చూసుకున్నప్పటికీ ప్రజల్లో




విస్తృతంగా ఉన్న కొన్ని పథకాల విషయంలో వైసిపి మారకపోతే కష్టం అనే భావన వినిపిస్తోంది.

**పెమ్మసాని ప్లాన్ తో గుంటూరు...**

గుంటూరు నగర అభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా మరో అడుగు పడింది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పట్టాభిపురం రైతు బజార్ నూతన హైటెక్ భవన నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవిలతో కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. నిత్యం వేలాది మందితో కిటకిటలాడే ఈ మార్కెట్‌ను కార్పొరేట్ స్థాయి వసతులతో ఆధునీకరించేందుకు ఈ మెగా ప్రాజెక్టును చేపట్టారు. వినియోగదారులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాదాపు రూ. 6 కోట్ల భారీ వ్యయంతో, సుమారు 11,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నూతన రైతు బజార్‌ను నిర్మించనున్నారు. అత్యంత ఆధునిక సాంకేతికతతో గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు రెండు అంతస్తుల భవనంగా ఇది రూపుదిద్దుకోనుంది. ఎండ, వానల నుండి రక్షణ కల్పిస్తూ పూర్తి హైజీనిక్ వాతావరణంలో కూరగాయలు కొనుగోలు చేసేలా ఈ ప్లాన్ డిజైన్ చేశారు. ఈ నూతన మల్టీ-లెవెల్ భవనంలో మొత్తం 100 అత్యాధునిక షాపులను ఏర్పాటు చేస్తున్నారు. సామాజిక, ఆర్థిక సమతుల్యతను పాటిస్తూ ఈ షాపుల కేటాయింపులో స్పష్టమైన ప్రణాళికను ప్రకటించారు. 60 షాపులను, నేరుగా గ్రామాల నుండి వచ్చే అసలైన రైతులకు కేటాయిస్తారు. 30 షాపులను స్వయం సహాయక బృందాలకు చెందిన డ్వాక్రా ( మహిళా వ్యాపారులకు కేటాయిస్తారు. మిగిలిన షాపులను ఇతర నిత్యావసర వస్తువుల విక్రయదారులకు కేటాయించనున్నారు. కేవలం షాపులే కాకుండా, కస్టమర్ల సౌకర్యార్థం ఈ భవనంలో అధునిక పార్కింగ్ సౌకర్యం, స్వచ్ఛమైన తాగునీరు, అత్యాధునిక టాయిలెట్స్ మరియు హైజీన్ వసతులను కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. "గత పాలకుల తీవ్ర నిర్లక్ష్యం వల్లే ఈ భవన నిర్మాణం ఇన్నాళ్లూ జాప్యం అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా రైతులకు, వినియోగదారులకు ఒకే చోట మేలు చేయడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. అంతేకాకుండా, కేవలం 9 నెలల రికార్డు కాలంలోనే ఈ భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

# సౌత్ పై జనసేన ఫోకస్...




**గుంటూరు, మే 16 పెన్ పవర్:**
జనసేనాని పవన్ కళ్యాణ్ తన పార్టీని కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేయకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడులకు విస్తరించే పనిలో పడ్డారు. ఇప్పటికే కేరళకు చెందిన పలువురు సామాజిక కార్యకర్తలు, కర్ణాటక నుంచి మాజీ ఎమ్మెల్యేలు జనసేన తీర్థం పుచ్చుకోవడం ఆ పార్టీ నేషనల్ ఇమేజ్ ను పెంచింది. ఎన్డీయే కూటమిలో కీలక నేతగా ఎదిగిన పవన్, దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి గొంతుకగా మారాలని భావిస్తున్నారు. అయితే, ఇతర రాష్ట్రాల్లో విస్తరణ వేగంగా జరుగుతున్నా, సొంత గడ్డ ఏపీలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఆయన అడుగులు చాలా నెమ్మదిగా పడుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది. ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా జనసేనలో ఇప్పటికీ పూర్తిస్థాయి జిల్లా, మండల కమిటీల నియామకం జరగకపోవడం క్యాడర్‌ను కొంత అసహనానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బిజీగా ఉండటం ఒక కారణమైతే, అర్హులైన వారికే పదవులు దక్కాలనే పట్టుదల మరొక కారణం. అయితే, క్షేత్రస్థాయిలో కమిటీలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, టీడీపీ-బీజేపీ నేతలతో సమన్వయం చేసుకోవడంలోనూ జనసైనికులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ జాప్యం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది. జనసేన బలోపేతానికి మరో పెద్ద అడ్డంకి.. పార్టీలోకి కొత్తగా వచ్చి చేరుతున్న వారితో పాటు సోషల్ మీడియా వేదికగా హడావుడి చేస్తున్న కొందరు కార్యకర్తలు. అధికారంలోకి వచ్చాక యాక్టివ్ అయిన వారు ఇప్పుడు నామినేటెడ్ పదవుల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. పదవులు రాకపోతే కూటమి ప్రభుత్వంపై, సొంత నాయకత్వంపైనే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ధోరణిని పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. అందుకే, అడ్వాంటేజ్ కోసం వచ్చే వారిని కాకుండా, పదేళ్ల పాటు పార్టీని నమ్ముకున్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్న ఆయన.. బాధ్యతల అప్పగింతలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. టీడీపీతో కలిసి ప్రభుత్వం నడుపుతున్న తరుణంలో, ఎక్కడ ఏ చిన్న తేడా వచ్చినా అది కూటమి పునాదులకే దెబ్బ తగులుతుందని పవన్ భావిస్తున్నారు. అందుకే పార్టీ పరంగా దూకుడు తగ్గించి, పరిపాలనపై ఎక్కువ దృష్టి పెట్టారు. అయితే, ఇదే సమయంలో టీడీపీ తన గ్రామ స్థాయి కమిటీలను పటిష్టం చేసుకుంటుంటే, జనసేన వెనుకబడిపోతోందనే ఆందోళన పార్టీ కార్యకర్తల్లో ఉంది. ముఖ్యంగా నియోజకవర్గాల ఇన్-ఛార్జుల విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడం వల్ల కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం వల్ల జాతీయ స్థాయిలో జనసేనకు లభించే గుర్తింపు, భవిష్యత్తులో ఏపీలో పార్టీ ఎదుగుదలకు ప్లస్ అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయం ఇప్పుడు ఎక్కువ మంది చేరడం నిబద్ధత కలిగిన నేతలు వైపు మళ్లింది. ఈ క్రమంలో జరిగే జాప్యం క్యాడర్‌కు ఇబ్బందిగా అనిపించినా, దీర్ఘకాలంలో ఇది పార్టీకి మేలు చేస్తుందని జనసేన అగ్ర నాయకత్వం వాదిస్తోంది. జనసేన పూర్తిస్థాయి కమిటీలతో సరికొత్త రూపం సంతరించుకుంటుందో లేదో వేచి చూడాలి.

# అమరావతికి యుద్ధ గండం...

**విజయవాడ, మే 16 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రజల ఐదేళ్ల నిరీక్షణ తర్వాత, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కుతున్న తరుణంలో ఊహించని గ్లోబల్ సవాళ్లు ఎదురవుతున్నాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు , పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు అమరావతి నిర్మాణాల కొనసాగింపును మరోసారి ప్రశ్నార్థకం చేస్తున్నాయి. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా సప్లై చెయిన్ దెబ్బతినడం, చమురు ధరలు పెరగడం వంటి కారణాలతో కేంద్ర ప్రభుత్వం భారీ ప్రాజెక్టులపై ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. ఈ క్రమంలో అమరావతి వంటి మెగా ప్రాజెక్టుల పురోగతిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని, భారీ నిర్మాణ పనులను కనీసం రెండేళ్ల పాటు వాయిదా వేయాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ముఖ్యంగా ప్రధాని మోదీ ప్రకటించిన ఆస్టెరిటీ పాలసీలో భాగంగా ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తుండటం అమరావతికి ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఈ ప్రచారాన్ని నీతి ఆయోగ్ తోసిపుచ్చినప్పటికీ, ఏపీలోని ప్రతిపక్షాలు దీనిని రాజకీయ అస్త్రంగా మార్చుకుంటున్నాయి. అమరావతి ఆగిపోతుందని అంటున్నారు. దీంతో రాజధాని నిర్మాణం మళ్లీ అటకెక్కుతుందా అనే ఆందోళన సామాన్య ప్రజల్లో నెలకొంది. అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల్లో సింహభాగం ప్రపంచ బ్యాంక్ , ఆసియా అభివృద్ధి బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రావాల్సి ఉంది. యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లు అస్థిరంగా మారితే, ఈ రుణాల మంజూరులో జాప్యం జరిగే ప్రమాదం ఉంది. గ్లోబల్ ఎకానమీ కుదేలైతే బ్యాంకులు తమ ప్రాధాన్యతలను మార్చుకునే అవకాశం ఉంటుంది. ఇదే ఇప్పుడు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద తలనొప్పిగా మారింది. రాజకీయంగా చూస్తే, అమరావతిని తన ప్రతిష్టగా భావిస్తున్న చంద్రబాబుకు ఇది ఒక అగ్నిపరీక్ష. ఒకవైపు రాష్ట్రంలో ఆర్థిక వనరుల కొరత, మరోవైపు కేంద్రం నుంచి అందాల్సిన సహకారం .. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం ఇప్పుడు ఆయన ముందున్న సవాల్. గతంలో పారిశ్రామికీకరణను పరుగులు పెట్టించిన అనుభవం ఉన్నప్పటికీ, ఇప్పుడు యుద్ధం వంటి బాహ్య శక్తుల ప్రభావం వల్ల ప్రాజెక్టు మందగిస్తే లక్ష్యం చేరుకోవడం ఆలస్యం అవుతుంది.

# స్ట్రాటిజిస్ట్ లుకాదు.. అస్ట్రాలిజిస్ట్స్

**విజయవాడ, మే 16 పెన్ పవర్:** రాజకీయాల్లో గెలుపు గుర్రం ఎక్కేందుకు వ్యూహకర్తలు ఇచ్చే డేటా కంటే, గ్రహగతులు మార్చే జ్యోతిష్యుల పైనే రాజకీయ నేతలు ఎక్కువ నమ్మకం పెంచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల తమిళనాడులో విజయ్ విజయం వెనుక జ్యోతిష్యుడి హస్తం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుండటంతో, ఇప్పుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా అదే బాట పట్టారు. చండీగఢ్‌కు చెందిన ప్రముఖ ఆస్ట్రాలజర్ రుద్ర కరణ్ ప్రతాప్ ప్రత్యేకంగా తాడేపల్లికి వచ్చి జగన్‌తో భేటీ కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గత ఎన్నికల్లో ఐప్యాక్ వంటి వ్యూహకర్తలను నమ్ముకున్న జగన్, ఈసారి మాత్రం గ్రహబలంపైనే భారం వేసినట్లు కనిపిస్తోంది. చండీగఢ్ నుంచి రుద్ర కరణ్ ప్రతాప్‌ను ప్రత్యేకంగా తాడేపల్లికి రప్పించడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయని వైసీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. రాజకీయ నాయకుల అవసరాలకు అనుగుణంగా జ్యోతిష్యం చెప్పడంలో రుద్ర కరణ్ సిద్ధహస్తుడని పేరుంది. తన పర్యటనకు సంబంధించిన వివరాలను సదరు జ్యోతిష్యుడు సోషల్ మీడియాలో స్వయంగా పంచుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిజానికి, 2024 ఎన్నికల్లో జగన్ ఘనవిజయం సాధిస్తారని రుద్ర కరణ్ ప్రతాప్ గతంలోనే జోస్యం చెప్పారు. అయితే ఆ అంచనాలు క్షేత్రస్థాయిలో తలకిందులయ్యాయి. అయినప్పటికీ, జగన్ ఆయనపై నమ్మకం కోల్పోకుండా మళ్ళీ పిలిపించి చర్చలు జరపడం గమనార్హం. కేవలం రాజకీయ భవిష్యత్తే కాకుండా, ప్రస్తుతం ఎదుర్కొంటున్న న్యాయపరమైన చిక్కులు, వ్యక్తిగత జాతక దోషాల నివారణ కోసం కూడా ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. స్ట్రాటజిస్టులు ఇచ్చే లెక్కలు ఒక్కోసారి తప్పవచ్చు కానీ, సరైన జ్యోతిష్యుడి సాయంతో గ్రహాలను అనుకూలం చేసుకోవచ్చని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. తమిళనాడులో విజయ్ పార్టీ పెట్టిన అతి తక్కువ కాలంలోనే అధికారంలోకి రావడానికి ఆయన వ్యక్తిగత జ్యోతిష్యుడు ఇచ్చిన సలహాలే కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విజయ్ ఫార్ములా ను చూశాక, జగన్ కూడా పొలిటికల్ స్ట్రాటజిస్టుల కంటే ఆస్ట్రాలజిస్టులే బెటర్ అనే ముగింపుకు వచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే తాడేపల్లి ప్యాలెస్‌లో ఇప్పుడు పొలిటికల్ డేటా కంటే, జాతక చక్రాలు, గ్రహాల సంచారంపైనే ఎక్కువ చర్చలు జరుగుతున్నాయి. జ్యోతిష్యుడి సలహాలు జగన్ జాతకాన్ని ఎంతవరకు మారుస్తాయో వేచి చూడాలి.

# భారీ మెజార్టీపై నేతలు కన్ను

**విశాఖపట్టణం, మే 16 పెన్ పవర్:** టిడిపిలోనే కొందరు నాయకులకు మెజారిటీ సమస్య ఇప్పుడు కొంత గడబిడగా మారింది. గత ఎన్నికల సమయంలో భారీ స్థాయి మెజారిటీతో విజయం దక్కించుకున్న చాలామంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఉదాహరణకు గాజువాక నియోజకవర్గంలో టిడిపి ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఊహించని మెజారిటీని సాధించారు. అదేవిధంగా మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ కూడా 90 వేల పైచిలుకు మెజారిటీని దక్కించుకున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది నాయకులు భారీ మెజారిటీని సొంతం చేసుకున్నారుఅయితే ఆ సమయంలో కూటమి ప్రభావంతో పాటు వైసిపి వ్యతిరేకత తీవ్ర స్థాయిలో కనిపించింది. దీనివల్లే వీరికి అనూహ్యమైన మెజారిటీ దక్కిందన్న వాదన ఉంది. వచ్చే ఎన్నికల నాటికి ఇదే ప్రభావం కనిపిస్తుందా.. లేకపోతే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి మారుతుందా.. అనేది ఇప్పుడు కొంతమంది నాయకులలో చర్చనీయాంశంగా మారింది. దీంతో తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఏఏ మండలాల్లో తమకు ఎక్కువగా ఓట్లు పడ్డాయి.. ఏ ఏ సామాజిక వర్గాల నుంచి తమకు ఓట్లు భారీ సంఖ్యలో పడ్డాయి.. అనే విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. తద్వారా ఆయా మండలాలు, ఆయా సామాజిక వర్గాలను మరింత మంచి చేసుకుని వచ్చే ఎన్నికల సమయానికి తమకు మెజారిటీ పెంచుకోవడంతో పాటు ఒకవేళ పెరిగినా పెరగకపోయినా తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు నాయకులు ప్రయత్నాలు చేయాలని భావిస్తున్నారు. ముఖ్యంగా గాజువాక నియోజకవర్గంలో పల్లా శ్రీనివాసరావు ఇటీవల పర్యటనలు చేస్తున్నారు. తన సామాజిక వర్గం నాయకులతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కూడా మమేకమవుతున్నారు. మెజారిటీ తగ్గకుండా చూడాలని ఆయన పదేపదే చెబుతున్నారు. గెలుపు అనేది ఖాయమే అయినప్పటికీ మెజారిటీ ఇప్పుడు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. ఇక మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ కూడా ఇదే ప్రయత్నాలు చేస్తున్నారు. తనను ఎవరు కలిసినా మెజారిటీపైనే దృష్టి పెట్టాలని ఆయన చెబుతున్నారు. ఈ రెండు నియోజకవర్గాలే కాదు రాష్ట్రవ్యాప్తంగా భారీ మెజారిటీ దక్కించుకున్న నాయకులంతా ఇదే పనిపై దృష్టి పెట్టడం విశేషం. మరి వీరు అనుకున్నట్టుగా మెజారిటీ కొనసాగుతుందా లేకపోతే తగ్గుతుందా అనేది చూడాలి. ప్రస్తుతానికైతే మెజారిటీ తగ్గకుండా చూసుకునేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికిగాను సంక్షేమ పథకాల అమలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

# తిరుమలలో గంటకు 10 వేల మంది దర్శనం

**తిరుమల, మే 16 పెన్ పవర్:** కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం ఇప్పుడు సులభతరంగా మారింది. టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు చేపట్టిన సరికొత్త చర్యల వల్ల వేలాది మంది భక్తులకు ఇప్పుడు కేవలం గంటల వ్యవధిలోనే స్వామి వారి దర్శన భాగ్యం కలుగుతోంది. వెరసి గతంలో గంటల తరబడి క్యూ లైన్లలో నిలవాల్సిన పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు. అదే సమయంలో దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు విడిది సౌకర్యం లభ్యత కూడా బాగా పెరిగింది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అందుబాటులోకి తెచ్చిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) వ్యవస్థ దోహదం చేస్తోందని చెప్పాలి. ఈ నెల 2న తిరుమల వెంకన్నను 91 వేల మంది దాకా దర్శనం చేసుకున్నారు. వీరందరికీ కేవలం 12 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సత్తా చాటింది. తాజాగా బుధవారం 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోగా... వారికి కేవలం 8 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సరికొత్త రికార్డు నమోదు చేసింది. అంటే.... గంటకు 10 వేల మంది చొప్పున స్వామి వారిని దర్శించుకునేలా టీటీడీ చర్యలు చేపట్టింది. గతంలో ఇదే 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోవాలంటే 18 నుంచి 24 గంటల సమయం పట్టేది. ఇప్పుడు ఐసీసీసీ వల్ల కేవలం ఓ గంటలోనే 10 వేల మందికి స్వామి వారి దర్శనం లభిస్తోంది. కేవలం అతి స్వల్ప వ్యవధిలోనే స్వామి వారి దర్శనం లభిస్తున్న నేపథ్యంలో తిరుమలలో విడిది గదులను బుక్ చేసుకుంటున్న భక్తులు.. దర్శనం వెంటనే వాటిని ఖాళీ చేస్తున్నారు. ఫలితంగా తిరుమల కొండపై విడిది గదుల కొరత అన్న సమస్యల ఉత్పన్నం కావడం లేదు. స్వామి వారి దర్శనం కోసం వస్తున్న దాదాపు అందరు భక్తులకూ విడిది గదులు లభిస్తున్నాయని చెప్పాలి. గతంలో అయితే గదుల కోసం భక్తులు సుదీర్ఘ కాలం పాటు వేచి చూడాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు త్వరితగతిన దర్శనాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో గదుల లభ్యత కూడా బాగా పెరిగింది.

# దువ్వాడ లెక్క ఏంటీ

**శ్రీకాకుళం, మే 16 పెన్ పవర్:** పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా కొందరు నాయకులు రాజకీయాల్లో వేసే వేషాలు.. అంతగా సక్సెస్ కావన్నది అందరికీ తెలిసిందే. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు పరిస్థితి కూడా ఇలానే ఉంది. వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకపోతే.. స్వతంత్రంగానే పోటీ చేస్తానని.. గెలిచి తీరుతానని చెబుతున్నారు. నిజానికి ఇలాంటి ప్రకటనలు చేయడం చాలా తేలిక. కానీ.. నిరూపించుకోవడం, సాధించడం మాత్రం అంత తేలికకాదు. ఒకప్పుడు ఒంటరిగా పోరాటం చేసేందుకు నాయకులు పెద్దగా వెనుకాడాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. బలమైన పార్టీల హవా.. ప్రభుత్వాల దూకుడు వంటివి ఎక్కువగా పనిచేస్తున్నాయి. అంతేకాదు, పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను.. వారి గ్రాఫ్‌నుకూడా ప్రజలు తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వచ్చిన తర్వాత అభ్యర్థుల వ్యవహార శైలి కూడా పెద్ద ఎత్తున చర్చకు వస్తోంది. ఇది వ్యక్తిగత అంశాల వరకు కూడా ప్రభావితం అవుతోంది. దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత ఇమేజ్ ఇబ్బందుల్లో ఉందనే చెప్పాలి. కుటుంబాన్ని ఆయన దూరం పెట్టి.. సహజీవనం చేస్తున్న వైనం.. సొంత అనుచరుల మధ్యే చర్చకు వస్తోంది. ఇక, నియోజకవర్గం రాజకీయంగా ఇది వివాదం అయ్యే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. దువ్వాడకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్ కూడా పెద్దగా కనిపించడం లేదు. నియోజకవర్గంలో ప్రజలకు ఏమైనా సేవ చేసి ఉంటే.. దానిని చెప్పుకొనేందుకు అవకాశం ఉండేది. కానీ, అలాంటిదేమీ లేదు ఇటు వైపు చూసుకుంటే టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడి ముందు దువ్వాడ తేలిపోతున్నారు. రాజకీయ పరంగా చూసుకున్నా.. వ్యక్తిగతంగా చూసుకున్నా.. రామ్మోహన్ ముందు దువ్వాడ ఎక్కడా సమ ఉజ్జీ కాదన్న వాదన ఉంది. గతంలో ఎప్పుడోపోటీ చేసినప్పుడు భారీ ఓట్లు వచ్చాయని అనుకున్నా.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సోషల్ మీడియాలో దువ్వాడ చిందులు పెద్ద ఎత్తున ప్రచారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒంటరి పోరు.. దువ్వాడకు చేదు అనుభవమే అవుతుందని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# పెట్రోల్ కాకపై.. లేటైనా రేవంత్ ఘాటు స్పందన!



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగి ఒకరోజు గడిచింది. శుక్రవారం తెలతెల వారుతూనే.. పెట్రోల్ పై 3, డీజిల్‌పై రూ.3 చొప్పున పెట్రోలియం కంపెనీలు బాదేశాయి. దేశవ్యాప్తంగా ఈ వ్యవహారం కాక రేపింది. పెట్రోలు, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచినందుకన్నా కూడా.. కార్యాకారణ సంబంధంగా వీటి కారణంగా.. ఇతర నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ వ్యవహారమే దేశవ్యా ప్తంగా ఇప్పుడు చర్చనీయాంశం అయింది.

ఈ నేపథ్యంలో బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు మౌనంగా ఉండగా.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఆచి తూచి స్పందించారు. మాటల మాంత్రికుడుగా పేరు తెచ్చుకున్న తెలం గాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యవహారంపై శనివారం స్పందిస్తూ.. కేంద్రంపై నిప్పులు చెరిగారు. ఐదు రాష్ట్రా ల ఎన్నికల ప్రచారంలో పెట్రోలు ధరలు పెంచేది లేదని చెప్పారని.. ఎన్నికలు ముగిసి.. 10 రోజులు కూడా కాకుండానే.. ధరలు పెంచారని వ్యాఖ్యానించారు.ఈ చర్యను ఆయన విశ్వాస ఘాతుకంగా అభివర్ణించారు. అంతేకాదు.. ఈ పెంపు.. ఇతర అంశాలపైనే ఎక్కువగా పడుతుందని రేవంత్ రెడ్డి చెప్పారు. సామాన్యులపై పిడుగు వంటిదన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు అనాలోచిత చర్యగా పేర్కొన్నారు. విశ్వగురు చేయాల్సిన పనేనా? అని ప్రశ్నించారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామనే ప్రధాని మోడీ.. ఈ పెంపును ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించారు. పెట్రోలు డీజిల్ ధరలను తగ్గించుకోవాలన్నారు.

**రాష్ట్రంలో చేయొచ్చు..**

దేశంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగిన దరిమిలా.. రాష్ట్రాలు ఆయా ప్రభుత్వాల పరిధిలో కొంత మేరకు ఉపశమనం కల్పించే చర్యలు తీసుకోవచ్చు. స్థానిక పన్నులను తగ్గించడం ద్వారా ప్రజలపై రూ.1 నుంచి 1.50 వరకు భారాన్ని తగ్గించే అవకాశం ఉంది. అయితే.. రాష్ట్రాలకు వచ్చే పన్నుల ఆదాయం తగ్గిపోతుం దన్న కారణంగా.. ప్రభుత్వాలు కూడా మౌనంగా ఉంటున్నాయి.

# పరాయి దేశాల రూల్స్ తెలియక చిక్కుల్లో పడుతున్న భారతీయులు..



**హైదరాబాద్ పెన్ పవర్:** విమాన ప్రయాణంలో ఫోటోలు తీసుకున్నందుకు ఒక భారతీయ వలస కార్మికుడికి దుబాయ్ కోర్టు 10 ఏళ్ల జైలు శిక్ష విధించిన ఘటన అంతర్జాతీయంగా పెద్ద సంచలనంగా మారింది. బీహార్‌కు చెందిన వసీం అక్రమ్ అనే అమాయక యువకుడు చేసిన చిన్న పొరపాటు అతడి జీవితాన్ని చీకట్లోకి నెట్టేసింది. అయితే, విదేశీ చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల ఇలాంటి ఘోర చిక్కుల్లో పడిన అమాయక భారతీయుల కథలు ఇవేం మొదటివి కావు. గతంలో కూడా కేవలం రూల్స్ తెలియక తీవ్రమైన శిక్షలు అనుభవించిన కొందరి బాధలు చెప్పలేనివి..ఆ వివరాలు చూద్దాం..

**సింగపూర్‌లో చూయింగ్ గమ్ తెచ్చిన జైలు పాలు..**

మన దేశంలో చూయింగ్ గమ్ నమలడం, ఎక్కడ పడితే అక్కడ ఉమ్మడం చట్టరీత్యా నేరం కాదు. కానీ సింగపూర్‌లో చూయింగ్ గమ్‌లను పూర్తిగా నిషేధించారు. కొన్నేళ్ల క్రితం భారతదేశం నుండి సింగపూర్‌కు ఉద్యోగం కోసం వెళ్లిన ఒక తెలుగు యువకుడు, తనతో పాటు కొన్ని చూయింగ్ గమ్ ప్యాకెట్లను బ్యాగులో తీసుకెళ్లాడు. ఇక అక్కడ విమానాశ్రయం తనిఖీల్లో అవి దొరకడంతో అధికారులు అతడిని అరెస్ట్ చేశారు. కేవలం నమలడానికే తెచ్చుకున్నానని, ఇక్కడ నిషేధమనే విషయం తనకు తెలియదని ఎంత మొరపెట్టుకున్నా అక్కడి చట్టాలు వదిలిపెట్టలేదు. ఇక భారీ జరిమానాతో పాటు కొన్ని నెలల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది.

**దుబాయ్‌లో ఇతరుల ఫోటోలు తీసి చిక్కుల్లో..**

సోషల్ మీడియా యుగంలో ఎక్కడైనా ఫోటోలు తీసి స్టేటస్‌లు పెట్టడం మనకు అలవాటు. కానీ గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా దుబాయ్‌లో పర్సనల్ ప్రైవసీ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. ఇక కేరళకు చెందిన ఒక వలస కార్మికుడు దుబాయ్‌లోని ఒక పర్యాటక ప్రాంతంలో సెల్ఫీ తీసుకుంటున్న సమయంలో, వెనుక కొంతమంది స్థానిక మహిళలు కూడా ఫోటోలో పడ్డారు. ఆ ఫోటోను అతడు ఫేస్‌బుక్‌లో షేర్ చేశాడు. ఆ మహిళల కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో, సైబర్ క్రైమ్ చట్టాల కింద ఆ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పరాయి స్త్రీలను వారి అనుమతి లేకుండా ఫోటో తీయడం అక్కడ పెద్ద నేరం. దాంతో ఆ యువకుడికి భారీ జరిమానా విధించి, ఆ తర్వాత దేశం నుండి బహిష్కరించారు.

అంతర్జాతీయ చట్టాల ప్రకారం "నాకు ఈ విషయం తెలియదు" అని చెప్పడం నేరం నుండి తప్పించుకోవడానికి కారణం కాలేదు. మన దేశంలో సాధారణంగా భావించే విషయాలు,ఫోటోలు తీయడం, కొన్ని రకాల మందులు తీసుకెళ్లడం, గాల్లో నోట్లు జల్లడం వంటివి,విదేశాల్లో తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయి. అందుకే ఏ దేశానికి వెళ్లినా అక్కడి కఠినమైన రూల్స్ మరియు సైబర్ చట్టాల గురించి ముందే తెలుసుకోవడం చాలా అవసరం.

బీహార్‌కు చెందిన వసీం అక్రమ్ ఉదంతం విదేశాలకు వెళ్లే ప్రతి ఒక్కరికీ ఒక కనువిప్పు లాంటిది. అమాయకత్వం వల్ల ఒక కుటుంబానికి ఆధారమైన వ్యక్తి పదేళ్లు జైలుపాలు కావడం అత్యంత హృదయవిదారకం.ఇక ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దౌత్యపరంగా జోక్యం చేసుకుని దుబాయ్ ప్రభుత్వంతో మాట్లాడితేనే వసీంకు విముక్తి లభిస్తుంది. విదేశాలకు వెళ్లే కార్మికులకు మన ప్రభుత్వాలు చట్టాలపై కనీస అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పెళ్లికి ముందు ఏడవాల్సిందేనా.. ఆశ్చర్యపరుస్తున్న కొత్త సాంప్రదాయం!

**హైదరాబాద్ పెన్ పవర్:** పెళ్లి అనగానే మనకు గుర్తొచ్చేది నవ్వులు, సందడులు, బాజభజంత్రీలు. కానీ, ప్రపంచంలో ఒక విచిత్రమైన చోట మాత్రం పెళ్లి చేసుకోవాలంటే వధువు కచ్చితంగా ఏడవాలట. అదీ ఒక్క రోజు కాదు.. పెళ్లికి నెల రోజుల ముందు నుంచే ఈ ఏడుపుల పండగ మొదలవ్వాలి. చైనాలోని ఒక ప్రత్యేకమైన తెగలో ఇప్పటికీ కొనసాగుతున్న ఈ వింత వివాహ సంప్రదాయం వెనుక ఉన్న ఆసక్తికరమైన కారణాలు, మన దేశంలోని పెళ్లిళ్ల భావోద్వేగాల గురించి పూర్తి సమాచారం మీకోసం..

**నెలకు ముందే మొదలయ్యే ఏడుపు:**

చైనాలోని 'తుజియా' అనే తెగ ప్రజలు ఒక వినూత్నమైన వివాహ సంప్రదాయాన్ని పాటిస్తారు. దీనిని వారు 'జువో టాంగ్' లేదా సాధారణ భాషలో 'క్రైయింగ్ మ్యారేజ్' అంటారు. ఇక ఈ ఆచారం ప్రకారం, వధువు తన పెళ్లికి సరిగ్గా నెల రోజుల ముందు నుంచే ఏడవడం ప్రారంభించాలి. ప్రతిరోజూ ఇక కచ్చితంగా ఒక గంట పాటు ఈ ఏడుపు కార్యక్రమం కొనసాగుతుంది.

**కుటుంబమంతా కలిసి ఏడవాలి:**

ఈ సంప్రదాయంలో వధువు ఒక్కతే ఏడిస్తే సరిపోదు. మొదటి పది రోజులు ఆమె ఒక్కతే ఏడిస్తే, ఆ తర్వాత రోజుల్లో ఆమెకు తోడుగా తల్లి, ఆపై అమ్మమ్మ, ఆ తర్వాత ఇతర మహిళా బంధువులు కూడా తోడవుతారు.ఇక అందరూ కలిసి కూర్చుని దుఃఖంతో కూడిన కొన్ని ప్రత్యేకమైన సాంప్రదాయ పాటలు పాడుతూ, లయబద్ధంగా ఏడుస్తారు.వినటానికి వింతగా వున్నా ఇది నిజం.

**ఎంత బాగా ఏడిస్తే అంత మంచిదట:**

మరో విచిత్రమైన విషయం ఏంటంటే.. ఈ ఆచారంలో వధువు ఎంత చక్కగా, రాగయుక్తంగా ఏడుస్తుందో ఆమెను అంత తెలివైనదిగా, గుణవంతురాలిగా ఆ సమాజం గుర్తిస్తుంది. ఇక



అసలు ఏడవటం రాని అమ్మాయిలను అక్కడ తక్కువ చేసి చూస్తారట. పుట్టింటిని వదిలి వెళ్తున్నందుకు బాధ, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత, అలాగే కొత్త జీవితంపై ఉండే ఆశల కలయికగా ఈ ఏడుపును వారు భావిస్తారు.ఇక ఇది తమ వైవాహిక జీవితంలో సుఖసంతోషాలను ఇస్తుందని వారి నమ్మకం.

**మన దేశంలో ఎలా ఉంటుంది?:**

మన భారతదేశంలో లేదా పాశ్చాత్య దేశాలలో ఇలా కచ్చితంగా ఏడవాలనే నియమం ఎక్కడా లేదు. కానీ, మన దగ్గర కూడా పెళ్లి సమయంలో వధువు కన్నీళ్లు పెట్టుకోవడం చాలా సహజంగా చూస్తుంటాం. ఇక అప్పగింతల సమయంలో పుట్టినిల్లు, స్నేహితులను వదిలి అత్తగారింటికి వెళ్లేటప్పుడు ఆడపిల్లల కళ్లలో వచ్చే నీళ్లు మన సంస్కృతిలో ఒక సహజమైన భావోద్వేగ ప్రక్రియ. ఇక ఏ దేశ సంప్రదాయాలు ఆ దేశానికి ప్రత్యేకం. చైనాలోని తుజియా తెగలో ఏడవడం అనేది బాధకు సంకేతం కాదు, అది వధువు తన కుటుంబంపై చూపించే ప్రేమకు ప్రతీక. రూపాలు వేరైనా, ఆడపిల్ల పెళ్లి చేసుకొని కొత్త ఇంట్లోకి అడుగుపెట్టేటప్పుడు పుట్టే భావోద్వేగాలు ప్రపంచవ్యాప్తంగా ఒకేలా ఉంటాయని ఈ ఆచారం నిరూపిస్తోంది. ఇక ఈ వింత సంప్రదాయం వినడానికి కొంచెం వింతగా ఉన్నా, అందులోని అంతరార్థం మాత్రం చాలా గొప్పది!

# పెట్రోల్ బాదుడు: వారు వీరిపైన.. వీరు వారిపైన!

**హైదరాబాద్ పెన్ పవర్:** పెట్రోల్ ధరల పెంపు ఎప్పటికప్పుడు తీవ్ర వివాదంగా మారుతోంది. వాస్తవానికి గతంలో రూపాయి చొప్పు న పెరిగితేనే దేశవ్యాప్తంగా కలకలం రేగేది. పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసనలు కనిపించేవి. కానీ.. రాను రాను రాజకీయాల్లోనూ ఈ వ్యవహారం పెద్దగా స్పందనలేని విషయంగా మారిపోయింది. తాజాగా రూ.3 చొప్పున పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగినా.. దేశంలో పెద్దగా స్పందన కనిపించడంలేదు. ఏదో సోషల్ మీడియాలో నాలుగు కామెంట్లు.. రెండు విమర్శలు అన్నట్టుగా మారిపోయింది.

అయితే.. అసలు పెట్రోలు, డీజిల్ ధరలను అదుపు చేయలేరా? అంటే.. చేయొచ్చు. ఇతర వస్తువులను.. సేవలను జీఎస్‌టీ పరిధిలోకి తీసుకువచ్చినట్టే.. ఇప్పుడు పెట్రోలు, డీజిల్‌ను కూడా జీఎస్టీ పరిధిలోకి తీసుకురావచ్చు. తద్వారా.. స్థానిక పన్నులు, వ్యాట్, లైబ్రరీ సెస్సు వంటివి ఉండవు. కేవలం జీఎస్టీ పరిధిలోని శ్లాబుల్లోనే పెట్రోలు , డీజిల్ ఉంటాయి. తద్వారా పన్నుల బాధ తప్పి.. ధరలు దిగి వచ్చే అవకాశం ఉంటుంది. కానీ, ఇలా చేసేందుకు గత 10 సంవత్సరాలుగా రాష్ట్రాలు ఒప్పుకోవడం లేదని కేంద్రం, కేంద్రానికి చిత్తశు ద్ధి లేదని రాష్ట్రాలు ఒకరిపై ఒకరు.. విమర్శలు చేసుకోవడం.. నిందలు మోపుకోవడంతోనే సరిపుచ్చుతు న్నారు. దీంతో రాష్ట్రాల పరిధిలో వ్యాట్ , ఇతర పన్నుల భారం పెరిగి.. పెట్రోలు ధరలు ఆకాశాన్ని అంటు తున్నాయి. ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే కూడా.. ఒక్క ఏపీలోనే పెట్రోల్ ధరలు పెరిగిపోయాయి. ఇక్కడ భారీ ధరలు ఉన్నాయి. గత వైసీపీ హయాంలోనే పెట్రోల్ ధరలు




ఎక్కువగా ఉన్నాయి.

దీంతో పొరుగు రాష్ట్రాల్లో ధరలు తక్కువగా ఉన్నాయంటూ.. మీడియా పెద్ద ఎత్తున అప్పట్లో హడావుడి చేసింది. అంతేకాదు.. టీడీపీ అధినేత చంద్రబాబు, ప్రస్తుత మంత్రి నారా లోకేష్ కూడా.. పెట్రోలు ధరల ను తాము వచ్చాక తగ్గిస్తామన్నారు. కానీ.. ఏమాత్రం తేడా లేదు. కాగా.. అసలు పెట్రోలు, డీజిల్ ను.. జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నది.. మేధావులు సూచిస్తున్నమాట. అయితే.. దీనివల్ల తమకు వచ్చే పన్నులను కేంద్రం లాగేసుకుని.. జనాభా ప్రాతిపదికన కేటాయిస్తే.. నష్టపోతామన్న.. వాదన రాష్ట్రాల నుంచి వినిపిస్తోంది.

# సర్వీసులకు బ్రేక్.. నో ఆన్లైన్ ఆర్డర్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా ఓలా, ఉబెర్ క్యాబ్‌లు బుక్ చేసుకునే వారికి, అలాగే స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్ యాప్స్ ద్వారా ఫుడ్ మరియు నిత్యవసర సరుకులు ఆర్డర్ చేసే వారికి శనివారం ఒక షాకింగ్ న్యూస్ ఎదురైంది. నిరంతరాయంగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా 'గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్' దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ సమ్మె ఎందుకు జరుగుతోంది, దీనివల్ల సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో తెలుసుకుందాం..

**మధ్యాహ్నం సర్వీసులు బంద్:**

ఇంధన ధరల పెరుగుదల వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని గిగ్ వర్కర్లు అంటే డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సుమారు 5 గంటల పాటు అన్ని రకాల యాప్ ఆధారిత సేవలను నిలిపివేయాలని యూనియన్ పిలుపునిచ్చింది. ఇక ఈ పాన్-ఇండియా షట్‌డౌన్ కారణంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ డెలివరీలు, క్యాబ్ సర్వీసులకు బ్రేక్ పడే అవకాశం ఉంది.

**ఎండ తీవ్రత.. పెరిగిన ఖర్చులు:**

ఇక ఇదంతా ఎందుకంటే యాజమాన్యం మాట్లాడుతూ.. ఇప్పటికే దేశంలో ఎండలు మండిపోతున్నాయని, ఇలాంటి కష్టకాలంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం డెలివరీ భాగస్వాములపై మోయలేని భారంగా మారిందని అన్నారు. ఇక ఒకవైపు ఎల్‌పీజీ గ్యాస్ ధరలు, మరోవైపు నిత్యావసరాల ఖర్చులు పెరిగిపోవడంతో రోజువారీ సంపాదనతో ఇల్లు గడవడం కష్టంగా మారిందని వారు బాధను వ్యక్తం చేసారు.

**కిలోమీటరుకు రూ. 20 డిమాండ్:**

ప్రస్తుతం కంపెనీలు ఇస్తున్న ఇన్సెంటివ్‌లు పెట్రోల్ బిల్లులకు, వెహికల్ సర్వీసింగ్ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని గిగ్ వర్కర్లు చెబుతున్నారు. అందుకే ప్రభుత్వం, అలాగే డిజిటల్ ప్లాట్‌ఫామ్ కంపెనీలు స్పందించి తమకు కిలోమీటరుకు కనీసం రూ. 20 చొప్పున కనీస చెల్లింపులు అందించాలని వారు ఇప్పుడు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

**సామాన్యులపై ప్రభావం:**

ఈ ఐదు గంటల సమ్మె కారణంగా ఆన్‌లైన్‌లో నిత్యావసరాలు ఆర్డర్ చేసేవారికి, అత్యవసరంగా క్యాబ్‌లలో ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పవు. ఇక స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్ వంటి యాప్స్‌లో ఆర్డర్లు ఆలస్యం కావడం లేదా సర్వీసులు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది. తమ న్యాయమైన డిమాండ్లను కంపెనీలు వినకపోతే నిరసనలు మరింత ఉధృతం చేస్తామని యూనియన్ హెచ్చరించింది.

మనం ఫోన్లలో క్లిక్ చేయగానే ఎండనక, వాననక మన ఇంటికి వస్తువులు చేర్చే గిగ్ వర్కర్ల సమస్యలు నిజంగా మనము ఆలోచించదగ్గవే. పెరిగిన ఇంధన ధరలకు అనుగుణంగా వారి ఆదాయం పెరగకపోతే వారు మనుగడ సాగించడం కష్టం. డిజిటల్ కంపెనీలు, ప్రభుత్వం త్వరలోనే వీరితో చర్చలు జరిపి ఒక మంచి నిర్ణయం తీసుకుంటాయని మనము ఆశిద్దాం..

# ‘టచ్ మీ నాట్’ మొక్కకు విచిత్ర సామర్థ్యం... తాజా పరిశోధనలో అద్భుత విషయం వెల్లడి

- ‘టచ్ మీ నాట్’ మొక్కకు వింత శక్తి
- సంఘటనలను కూడా లెక్కబెట్టగలవని నిర్ధారణ
- కణాల స్థాయిలోనే గుర్తుంచుకునే శక్తి
- విలియం అండ్ మేరీ యూనివర్సిటీ పరిశోధనలో వెల్లడి



సాధారణంగా ముట్టుకుంటే ముడుచుకునే ‘టచ్ మీ నాట్’ మొక్కకు వింత శక్తి ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ మొక్కకు సంఘటనలను లెక్కబెట్టే సామర్థ్యం ఉందని పరిశోధనలో తేల్చారు. మేధస్సు లేదా తెలివితేటలు కేవలం మెదడు ఉన్న జీవులకు మాత్రమే పరిమితం కాదని ఈ ఆవిష్కరణ నిరూపిస్తోంది. విలియం అండ్ మేరీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ పీటర్ విష్టన్, విద్యార్థి పేజ్ బార్టోష్‌ల బృందం ఈ విషయాన్ని ప్రపంచానికి వెల్లడించింది. పర్యావరణంలో వచ్చే మార్పులను అంచనా వేయడానికి ఈ మొక్కలు కేవలం సమయం మీద మాత్రమే ఆధారపడట్లేదని, అవి కాంతి మార్పుల ఫ్రీక్వెన్సీని ట్రాక్ చేస్తున్నాయని పీటర్ బృందం తమ పరిశోధనలో గుర్తించింది. మొక్కలు కేవలం సమయాన్ని మాత్రమే లెక్కిస్తాయా లేక సంఘటనలను కూడా లెక్కబెట్టగలవా అని పరీక్షించడానికి పరిశోధకులు 24 గంటల పగలు, రాత్రి విధానాన్ని మార్చి చూశారు. వారు వెలుతురు, చీకటి సమయాలను పూర్తిగా రాండమ్‌గా మారుస్తూ ప్రత్యేక సైకిల్‌ను రూపొందించారు. ఈ ప్రయోగంలో ‘టచ్ మీ నాట్’ మొక్కలు అద్భుతమైన సామర్థ్యాన్ని ప్రదర్శించాయి. వెలుతురు రావడానికి కొన్ని క్షణాల ముందే అవి తమ ఆకులను తెరవడం ప్రారంభించాయి. ఒక రెగ్యులర్ క్లాక్ ఫాలో అవ్వకుండా.. కాంతి ఎన్నిసార్లు మారిందో లెక్కబెట్టడం ద్వారానే మొక్కలు ఇలా ముందే ఊహించి స్పందించగలిగాయనే నిర్ధారణకు వచ్చారు. ఈ పరిశోధన ఎవల్యూషనరీ బయాలజీలో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్రీయ నాడీ వ్యవస్థ లేకపోయినా జీవులు సంఖ్యలను ప్రాసెస్ చేయగలవని, పర్యావరణం నుంచి నేర్చుకోగలవని ఇది స్పష్టం చేస్తోంది. ఈ రకమైన ఇంటెలిజెన్స్ కణాల స్థాయిలో కొన్ని క్లిష్టమైన రసాయన లేదా ఎలక్ట్రికల్ సిగ్నల్స్ ద్వారా పనిచేస్తుండొచ్చని పరిశోధకులు అంటున్నారు. కేవలం బ్రెయిన్ సెల్స్ మాత్రమే కాకుండా, ప్రతి జీవకణం సమాచారాన్ని గుర్తుంచుకొని భవిష్యత్తు అవసరాలకు వాడుకోగలదని విష్టన్ వివరించారు.


# అంతర్జాతీయ పరిణామాల ఎఫెక్ట్.. నేలచూపులు చూస్తున్న బంగారం, వెండి

- దేశీయ మార్కెట్‌లో మరోసారి పతనమైన బంగారం, వెండి ధరలు
- అంతర్జాతీయ అనిశ్చితులు, డాలర్ బలపడటమే ప్రధాన కారణం
- 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ.980 మేర తగ్గుదల
- కిలో వెండి ధర ఏకంగా రూ.15,000 పడిపోయి రూ.2.9 లక్షలకు చేరిక



దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు శనివారం కూడా నేలచూపులు చూశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, యూఎస్ డెట్ సెక్యూరిటీలపై రాబడులు పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం వంటి అంశాలు దేశంలో పసిడి, వెండి ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా, ఈ విలువైన లోహాల ధరలు మరోసారి భారీగా తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ అందించిన సమాచారం ప్రకారం ఇవాళ ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో ధరలు గణనీయంగా తగ్గాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ.980 తగ్గి రూ.1,56,930కి పడిపోయింది. అదేవిధంగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా 10 గ్రాములకు రూ.900 తగ్గి రూ.1,43,850 వద్ద స్థిరపడింది. బంగారం బాటలోనే వెండి ధర కూడా పయనించింది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధరపై ఏకంగా రూ.15,000 మేర పతనం నమోదైంది. ఈ భారీ తగ్గుదలతో కిలో వెండి ధర రూ.2.9 లక్షలకు దిగివచ్చింది. గ్లోబల్ మార్కెట్‌లోని మార్పులే దేశీయంగా ధరల తగ్గుదలకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# మహిళా ఉద్యోగి పీరియడ్స్‌పై బాస్ క్రేజీ రియాక్షన్.. వాట్సాప్ చాట్ వైరల్




కార్పొరేట్ ప్రపంచంలో మేనేజర్ అంటేనే ఎప్పుడూ టార్గెట్లు, డెడ్‌లైన్లతో టెన్షన్ పెట్టే వ్యక్తి అనే ముద్ర ఉంటుంది. కానీ ఒక ఉద్యోగిని పడుతున్న శారీరక ఇబ్బందిని, ఆమె చెప్పకపోయినా అర్థం చేసుకుని మేనేజర్ వ్యవహరించిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నళిని ఉనాగర్ అనే ఎక్స్ యూజర్ షేర్ చేసిన ఒక వాట్సాప్ చాట్ స్క్రీన్‌షాట్ ఇప్పుడు నెటిజన్ల మధ్య ఒక పెద్ద చర్చకు తెరలేపింది. నిజమైన మగవాళ్లు మహిళలను కంఫర్టబుల్ గా ఫీల్ అయ్యేలా చేస్తారు.. అంతేగానీ గిల్టీగా ఫీల్ అవ్వనివ్వరు అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ చాట్ కార్పొరేట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఒక మహిళా ఉద్యోగిని తనకు ఆరోగ్యం బాగోలేదని, మధ్యాహ్నం 12 గంటల తర్వాత లాగిన్ అవుతానని తన మేనేజర్‌కు మెసేజ్ చేసింది. దానికి ఆ మేనేజర్ ఎంతో సానుకూలంగా స్పందిస్తూ ‘ఓకే.. నో వర్రీస్’ అని రిప్లై ఇచ్చాడు. ఆ తర్వాత ఆమె ఆరోగ్యం గురించి తెలుసుకునేందు సదరు మేనేజర్ “ఏదైనా సీరియస్ ప్రాబ్లమా?” అని ఆమెను అడిగాడు. దానికి ఆమె “ఏం లేదు, నార్మల్ బాడీ పానిక్” అని సమాధానమిచ్చింది. దాంతో ఆ మేనేజర్ పరిస్థితిని అర్థం చేసుకుని ఓహో.. పీరియడ్స్‌నా? అని అడిగాడు. ఆమె అవునని కన్ఫర్మ్ చేయడంతో.. కంపెనీలో పీరియడ్స్ సమయంలో ఆరోగ్యం బాగోలేకపోతే 2-3 రోజులు లీవ్ తీసుకోవచ్చు.. జీతం కట్ అవుతుందేమో అని అస్సలు భయపడొద్దు.. బిందాస్ ఆరామ్ కరో అంటూ రెస్ట్ తీసుకోమని భరోసా ఇచ్చాడు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో షేర్ చేసిన కొద్దిసేపటికే వైరల్ అవ్వడమే కాకుండా.. నెటిజన్లను రెండు వర్గాలుగా చీల్చేసింది. ఒక వర్గం వారు మేనేజర్ చూపించిన మానవత్వాన్ని, సానుభూతిని పొగుడుతున్నారు. ఆయన పీరియడ్స్ అని అంత ఓపెన్‌గా అడిగిన విధానానికి సెల్యూట్.. అదే వేరే మేనేజర్ అయితే ఈ పాటికి పోష్ కేసు అయ్యేది అని కొందరు ప్రశంసించారు. అయితే మరో వర్గం వారు మాత్రం మేనేజర్ ప్రొఫెషనల్ లిమిట్స్ దాటారంటూ విమర్శిస్తున్నారు. ఉద్యోగి అనారోగ్యంతో లీవ్ అడిగినప్పుడు ఓకే చెప్పాలి కానీ.. పర్సనల్ విషయాల్లోకి దూరి ఆ ప్రాబ్లం ఏంటో అడగాల్సిన అవసరం లేదని అంటున్నారు. మరికొందరు మేనేజర్లు ఈ చాట్‌పై స్పందిస్తూ.. కార్పొరేట్ లైఫ్‌లో ఉద్యోగులపై ఇంత ఉదారత చూపిస్తే వాళ్లు పనిని తేలికగా తీసుకుంటారని, అది చివరకు మేనేజర్ ఉద్యోగానికే ఎసరు తెస్తుందని ప్రాక్టికల్ కామెంట్లు చేశారు. అలాగే తోటి మగ ఉద్యోగులు కూడా ఇలాంటి సమయాల్లో అదనపు పని భారాన్ని మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనప్పటికీ కంపెనీ పాలసీని అమలు చేస్తూనే.. తోటి ఉద్యోగి పట్ల ఆ మేనేజర్ చూపించిన చొరవ చాలామంది హృదయాలను గెలుచుకుంది.

# విశ్వానికి, మనకు ఉన్న బంధం ఇదే... సైన్స్ చెప్పే సత్యాలు!

- విజ్ఞానం కేవలం వాస్తవాలు కాదు, జీవితానికి అర్థాన్నిచ్చే అద్భుతం
- బిగ్ బ్యాంగ్ నుంచి మానవుడి వరకు అంతా ఒకటే అనుసంధానం
- భూమిపై ఉన్న జీవమంతా ఒకే డీఎన్ఏ ప్రవాహం నుంచి వచ్చింది
- విశ్వంలోనే అతిపెద్ద అద్భుతం మానవ చైతన్యం
- మనం బ్రతికి ఉండటమే ఒక మహాద్భుతం



విజ్ఞాన శాస్త్రం అంటే కేవలం వాస్తవాలు, సూత్రాలు, సమీకరణాలు మాత్రమేనా? అది జీవితంలోని లోతైన అనుభూతులకు, భావోద్వేగాలకు దూరంగా ఉంటుందా? చాలామంది ఇలాగే భావిస్తారు. కానీ, ఇది పూర్తిగా నిజం కాదంటున్నారు శాస్త్రవేత్త, రచయిత లారెన్స్ రిఫ్కిన్. ‘సైంటిఫిక్ అమెరికన్’ గెస్ట్ బ్లాగ్‌లో ఆయన రాసిన ‘విజ్ఞానం యొక్క 10 అద్భుతాలు’ అనే వ్యాసం, మన ఆలోచనా విధానాన్ని మార్చేలా ఉంది. విజ్ఞానం కేవలం ప్రపంచం ఎలా పనిచేస్తుందో చెప్పడమే కాదు, మన ఉనికికి, అనుబంధాలకు, ఆశ్చర్యాలకు ఓ పెద్ద చిత్రాన్ని అందిస్తుందని ఆయన వివరిస్తున్నారు.


**రిఫ్కిన్ చెప్పిన 10 అద్భుతాలు ఇవే:**

1. సంక్లిష్టతకు అవకాశం: ఈ విశ్వంలో ఉన్న భౌతిక నియమాలు, సహజ ప్రక్రియలు సంక్లిష్టమైన రూపాలు ఏర్పడటానికి అనుమతిస్తాయి. ఈ లక్షణం లేకపోతే నక్షత్రాలు, గ్రహాలు, జీవం, చివరికి మనం కూడా ఉండేవాళ్లం కాదు. ఇది విశ్వం యొక్క ప్రాథమిక అద్భుతం.
2. నక్షత్రాల అనంత సంఖ్య: ఈ విశ్వంలో ఉన్న నక్షత్రాల సంఖ్యను ఊహించడం కూడా కష్టం. మానవజాతి చరిత్రలో ఇప్పటివరకు అందరూ కలిసి పలికిన మాటల కన్నా ఆ సంఖ్య ఎన్నో రెట్లు ఎక్కువని తెలిస్తే ఆశ్చర్యం కలగక మానదు.
3. విశ్వంతో మన అనుసంధానం: మహా విస్ఫోటనం (బిగ్ బ్యాంగ్) నుంచి నక్షత్రాలు, నక్షత్ర ధూళి నుంచి భూమి, భూమి నుంచి ఏకకణ జీవులు, వాటి పరిణామ క్రమం నుంచి చైతన్యం, స్వేచ్ఛ ఉన్న మానవుల ఆవిర్భావం... ఇలా చూస్తే మనం ఈ ప్రపంచానికి బయటి నుంచి వచ్చిన వాళ్లం కాదు. మనం ఈ విశ్వంలోంచే పెరిగి, దానిలో ఒక భాగమయ్యాం.
4. జీవన ప్రవాహం: భూమిపై ఇప్పటివరకు ఉన్న ప్రతి బ్యాక్టీరియా, బొద్దింక, పక్షి, మనిషి, కప్ప... అన్నీ ఒకే నిరంతర డీఎన్ఏ ప్రవాహం నుంచి వచ్చినవే. కొన్ని బిలియన్ సంవత్సరాల క్రితం మొదలైన ఆ జీవధార, ఏ ఆటంకం లేకుండా నేటికీ కొనసాగుతోంది. పరిణామం యొక్క శక్తిని అర్థం చేసుకుంటే అది మనపై లోతైన ప్రభావం చూపుతుంది.
5. మనమంతా ఒక్కటే: మనం అందరం ఒకే నక్షత్ర ధూళితో తయారయ్యాం. ఒకే నక్షత్రం (సూర్యుడు) నుంచి శక్తి పొందుతున్నాం. ఒకే గ్రహంపై జీవిస్తూ, ఒకే జన్యు కోడ్‌ను పంచుకుంటున్నాం. ప్రకృతి నుంచి గానీ, ఒకరి నుంచి ఒకరం గానీ మనం వేరు కాదు. ఈ భావన మనమంతా ఒక్కటే అనే బలమైన పునాదిని ఇస్తుంది.
6. చైతన్యం అనే అద్భుతం: ఉనికితో పాటు అతి పెద్ద విజ్ఞాన అద్భుతం మన చైతన్యం. మనం ప్రకృతిలో ఒక భాగం. సత్యాన్ని తెలుసుకునే, ప్రేమించే, నైతికంగా ఆలోచించే, భవిష్యత్తును ప్రణాళిక చేసుకునే సామర్థ్యం మన సొంతం. ఈ స్థాయిలో స్వీయ-స్పృహ, మనకు తెలిసినంతవరకు, ఈ విశ్వంలో కేవలం మనలోనే ఉంది.
7. ఆధునిక విజ్ఞాన ఆవిష్కరణలు: ఆధునిక సైన్స్ మనకు అందించిన వాస్తవాలు మనసును ఆశ్చర్యపరుస్తాయి. పదార్థం శక్తిగా మారడం, అంతరాళం వంగడం, వేగంగా ప్రయాణిస్తే కాలం నెమ్మదించడం, చిన్న అణు కేంద్రకం నుంచి భారీ శక్తి విడుదల కావడం, గ్రహం మీద తక్షణమే సంభాషించడం వంటివి కొన్ని ఉదాహరణలు మాత్రమే.
8. ఆరోగ్యం, సౌకర్యం: ఆధునిక వైద్యం వల్ల మన సగటు జీవితకాలం మన ముత్తాతల కాలం కంటే దాదాపు రెట్టింపు అయింది. ఇది విజ్ఞానం మనకు అందించిన అసాధారణమైన బహుమతి.
9. భవిష్యత్తుపై భరోసా: భవిష్యత్తులో విజ్ఞానాన్ని తెలివిగా ఉపయోగిస్తే, అది కేవలం సాంకేతిక ప్రయోజనాలకే కాకుండా, మానవ ఉనికికి మరింత అర్థాన్ని, విలువను ఇవ్వడానికి ఉపయోగపడుతుంది.
10. మనం బ్రతికి ఉండటమే అద్భుతం: నిశితంగా చూస్తే, ‘నిర్దిష్టంగా నేను’ లేదా ‘మీరు’ ఈ ప్రపంచంలోకి వచ్చే అవకాశాలు దాదాపు శూన్యం. లెక్కలేనంత అసంభవం. సరళంగా చెప్పాలంటే, మనం బ్రతికి ఉండటమే ఒక లోతైన అద్భుతం, ఓ గొప్ప అదృష్టం. మనం పుట్టిన తర్వాతే మనకంటూ ఓ ఉనికి ఏర్పడుతుంది. విజ్ఞానం మనకు ఇచ్చే అతిపెద్ద సందేశం బహుశా ఇదే.

# పెట్రోల్, డీజిల్ పై రూ.3 పెంచినా కంపెనీలకు నష్టాలు తగ్గట్లే.. మరి ఎంత పెంచాలి: లెక్కలివే!

దేశ వ్యాప్తంగా పెట్రోల్ డీజిల్ రేట్లను జనానికి నొప్పి తెలియకుండా జస్ట్ లీటరుకు రూ.3 మాత్రమే పెంచింది మోడీ సర్కార్ 5 రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తి కాగానే. అయితే ఆయిల్ కంపెనీలు మాత్రం ఇది అస్సలు సరిపోదని కనీసం మరో రూ.25 పెంచితేనే తమకు వస్తున్న నష్టాలు పూడుతాయని అంటున్నాయి. ప్రభుత్వం రానున్న నెలల్లో రెండు మూడు విడతలుగా రేట్ల పెంపుతో ఈ నష్టాల గ్యాప్ తగ్గించొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే రేట్లు పెంచుతున్నా కంపెనీలకు మాత్రం ఆ బెనిఫిట్ దక్కట్లేదంట. రేట్లు పెంచినా ఆయిల్ సంస్థలకు నష్టాలు తగ్గకపోవటానికి అసలు కారణం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం రండి.. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వల్ల ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు(ఎంపీజం) కాస్త ఊరట లభిస్తుందని అందరూ భావించారు. కానీ అసలు ట్విస్ట్ ఇక్కడే ఉంది. రూపాయి విలువ రోజురోజుకూ పడిపోతూ రికార్డ్ కనిష్టాలను తాకుతుండటంతో.. పెట్రోల్ రేట్ల పెంపు వల్ల వచ్చే ప్రయోజనాలన్నీ బూడిదలో పోసిన పన్నీరులా మారిపోతున్నాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీసెర్చ్ తన తాజా ‘ఎకోర్యాప్’ రిపోర్టులో వివరిస్తూ బాంబు పేల్చింది.ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నా.. దేశీయంగా రిటైల్ ధరలను మార్చకపోవడం వల్ల చమురు కంపెనీలు రోజుకు దాదాపు వెయ్యి కోట్ల రూపాయల మేర నష్టపోతున్నాయని స్టేట్ బ్యాంక్ అంచనా వేసింది. అంటే ఏడాదికి సుమారు రూ.3లక్షల 6 వేల కోట్ల నష్టం అన్నమాట. ఇప్పుడు పెంచిన లీటరుకు రూ.3ల వల్ల కంపెనీలకు రూ.52వేల 700 కోట్ల వరకు ఊరట లభిస్తుంది. కానీ ఇది వారు ఎదుర్కొంటున్న మొత్తం నష్టంలో జస్ట్ 15 శాతం మాత్రమే. మిగతా 85 శాతం నష్టం అలాగే కొనసాగుతూ కొండలా పేరుకుపోతోంది. అయితే అసలైన ప్రమాదం దేశీయ ఇంధన ధరలతో కాదు.. పడిపోతున్న భారత రూపాయి విలువతోనే అంటోంది ఎస్‌బీఐ రీసెర్చ్. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరో రూ.2 పడిపోతే.. ఇప్పుడు పెట్రోల్ రేట్లు పెంచడం వల్ల చమురు కంపెనీలకు వచ్చిన లాభాలన్నీ పూర్తిగా ఆవిరై ప్రయోజనం సున్నా అవుతుందట.

# గుండు సూది నుంచి గిఫ్ట్స్ వరకూ చైనా ఇచ్చిన వస్తువులు చెత్తబుట్టలో పడేసిన ట్రంప్ టీమ్.. ఎందుకంటే?



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనాలో జరిపిన రెండు రోజుల పర్యటన ఎలాంటి భారీ ఒప్పందాలు లేకుండానే ముగిసింది. ట్రేడ్, రేర్ ఎర్త్స్ వంటి కీలక అంశాలపై గట్టి హామీలు సాధించాలనే పెద్ద ఆశలతో బీజింగ్ వెళ్లిన ట్రంప్‌కు.. కేవలం సోయాబీన్స్, బోయింగ్ విమానాలకు సంబంధించిన ఒప్పందాలు మినహా ఆశించిన ఫలితాలు దక్కలేదు. అయితే ఈ పర్యటన ముగింపులో అమెరికా ప్రతినిధి బృందం వ్యవహరించిన తీరు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. చైనా అధికారులు తమకు బహుమతిగా ఇచ్చిన ప్రతి వస్తువునూ ఎయిర్ ఫోర్స్ వన్ ఎక్కే ముందు మెట్ల వద్దే ఉన్న డస్ట్‌బిన్‌లో పడేసి ట్రంప్ టీమ్ ఖాళీ చేతులతో వాషింగ్టన్ తిరుగుపయనమైంది.వైట్ హౌస్ సిబ్బంది, అమెరికన్ జర్నలిస్టులతో కూడిన ట్రంప్ టీమ్.. చైనా ఇచ్చిన బర్నర్ ఫోన్లు, లాపెల్ బ్యాడ్జీలు, ప్రెస్ ఇన్విటేషన్స్, గిఫ్ట్స్ తో సహా అన్నింటినీ చెత్తబుట్టలో పారేసింది. చైనా నిఘా, గూఢచర్య వలయం నుంచి రక్షణ పొందేందుకే భద్రతా ప్రోటోకాల్ ప్రకారం ఇలా చేసినట్లు తేలింది. చైనా ఇటువంటి పద్ధతులకు పాల్పడుతుందనే ఆరోపణలు కొత్తేమీ కాదు. గతంలో బీజింగ్‌లోని బ్రిటీష్ ఎంబసీ సిబ్బందికి బహుమతిగా ఇచ్చిన టీపాట్‌లో కూడా నిఘా పరికరాన్ని కనుగొన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ పర్యటనలో ట్రంప్‌తో పాటు ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్, ఎలాన్ మస్క్ కూడా పాల్గొన్నారు. హ్యాకింగ్ బారిన పడకుండా ఉండటానికి వీరంతా తమ వ్యక్తిగత ఫోన్లను ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలోనే సిగ్నల్స్ బ్లాక్ చేసే ఫారడే బ్యాగులలో ఉంచి.. పర్యటన అంతటా కేవలం బర్నర్ ఫోన్లనే వాడారు. పైకి ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఎంతో స్నేహపూర్వకంగా కనిపించినప్పటికీ.. తెరవెనుక తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. బీజింగ్‌లోని టెంపుల్ ఆఫ్ హెవెన్ సందర్శన సమయంలో తుపాకీ కలిగి ఉన్న అమెరికన్ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌ను చైనా అధికారులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య చిన్న ఘర్షణలు జరిగాయి. అలాగే ద్వైపాక్షిక సమావేశానికి ముందు చైనా రిపోర్టర్ల తొక్కిసలాటలో వైట్ హౌస్ అధికారి ఒకరు గాయపడ్డారు. ఈ గందరగోళ పరిస్థితులపై అమెరికా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫైనల్ గా ఎలాంటి పెద్ద రాజకీయ ప్రయోజనాలు నెరవేరకపోయినప్పటికీ, ట్రంప్ చైనా పర్యటన ఇరుదేశాల మధ్య ఉన్న అపనమ్మకాన్ని, భద్రతాపరమైన ఆందోళనలను మరోసారి స్పష్టంగా బయటపెట్టింది.

# విదేశీ సూపర్ ఫుడ్స్ కోసం వెదకాల్సిన పనిలేదు.. వంటింట్లోనే ఉన్నాయి..



విదేశీ సూపర్‌ఫుడ్స్ కోసం వెతకాల్సిన అవసరం లేకుండానే భారతీయ వంటగదిలోనే ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పదార్థాలు దాగి ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. రోజూ వాడే కొన్ని సాధారణ మసాలా దినుసులు కూడా బెర్రీల వంటి సూపర్‌ఫుడ్స్‌కు సమానమైన యాంటీఆక్సిడెంట్ శక్తిని అందించగలవని తాజా సూచనలు వెల్లడిస్తున్నాయి. బెర్రీలు, నట్స్, ఆలివ్ ఆయిల్, ఆకుకూరలు వంటి సూపర్‌ఫుడ్స్ ఆరోగ్యానికి మంచివని ఫిట్‌నెస్ నిపుణులు తరచూ సూచిస్తుంటారు. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉండి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం వంటి ప్రయోజనాలు కలిగిస్తాయి.

**అర టీస్పూన్ మోతాదులో చాలు..**

అయితే ఇంట్లోనే ఉండే జీలకర్ర, దాల్చిన చెక్క, లవంగం వంటి మసాలాలు కూడా శరీరానికి సమానంగా మేలు చేస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. సరైన మసాలాలను కేవలం అర టీస్పూన్ మోతాదులో తీసుకున్నా ఒక బౌల్ బెర్రీలకు సమానమైన యాంటీఆక్సిడెంట్ శక్తిని పొందవచ్చని చెబుతున్నారు. ఈ ప్రత్యేక మిశ్రమంలో అర టీస్పూన్ జీలకర్ర, అర టీస్పూన్ దాల్చిన చెక్క పొడి, ఒక చిటికెడు లవంగం పొడి ఉంటాయి. ఈ కలయిక జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా శరీర మెటబాలిజాన్ని కూడా బలోపేతం చేస్తుందని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు.

**దాల్చిన చెక్క, జీలకర్ర..**

దాల్చిన చెక్క రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని పలు పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచి మధుమేహం ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. జీలకర్ర జీర్ణ ఎంజైమ్‌ల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అలాగే పొట్ట ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలను తగ్గించడంలోనూ ఇది ఉపయోగకరంగా ఉంటుంది. లవంగంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. దీనికి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీమైక్రోబియల్ గుణాలు ఉండటంతో శరీరాన్ని ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. ఇక ఈ మసాలా మిశ్రమాన్ని గోరువెచ్చని నీటిలో కలిపి తాగవచ్చు. అలాగే భోజనం మీద చల్లి తీసుకోవచ్చు లేదా రోజువారీ ఆహారంలో భాగంగా చేర్చుకోవచ్చు. ఈ మిశ్రమం పరిమాణంలో చిన్నదైనా శరీర కణాల స్థాయిలో పనిచేసి మెటబాలిక్ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఒకేసారి ఎక్కువగా తీసుకోవడం కంటే ప్రతిరోజూ క్రమం తప్పకుండా తీసుకోవడమే ముఖ్యమని సూచిస్తున్నారు. సరైన ఆహార ఎంపికలు ఆరోగ్యంపై గొప్ప ప్రభావాన్ని చూపుతాయని, ఆరోగ్య సంరక్షణ ఎప్పుడూ క్లిష్టంగా ఉండాల్సిన అవసరం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

# వైవిధ్యం ఉండాల్సిందే!



బరువు తగ్గాలనో, ఆరోగ్యం కోసమో.. కొందరు స్ట్రిక్ట్ డైట్ పాటిస్తుంటారు. రోజూ ఒకే రకమైన ఆహారం తీసుకుంటారు. అయితే, ఈ అలవాటు పేగుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆహారంలో వైవిధ్యం ఉన్నప్పుడే.. గట్ హెల్త్ బాగుంటుందని చెబుతున్నారు. పేగుల్లో కొన్ని వందల రకాల మంచి బ్యాక్టీరియాలు ఉంటాయి. మనం తినే రకరకాల ఆహార పదార్థాలతోనే అవి శక్తిని పొందుతాయి. అయితే, ఒకే రకమైన ఆహారం తిన్నప్పుడు.. కేవలం కొన్ని రకాల బ్యాక్టీరియాకు మాత్రమే పోషణ అందుతుంది. మిగిలిన మంచి బ్యాక్టీరియాలు క్రమంగా అంతరించిపోతాయి. అలా, పేగుల్లో బ్యాక్టీరియా వైవిధ్యం తగ్గితే.. జీర్ణక్రియ మందగించడం, రోగనిరోధక శక్తి బలహీనపడటం లాంటి సమస్యలు వస్తాయి. ఇక ఎంత ఆరోగ్యకరమైన ఆహారమైనా సరే.. అందులో అన్నిరకాల విటమిన్లు, ఖనిజాలు ఉండవు. దాంతో, పోషకాహార లోపం ఏర్పడుతుంది. అంతేకాకుండా, శరీరం ఒకే రకమైన ఆహారానికి అలవాటు పడిపోతే.. కొన్నిరోజులకు కొత్తరకం ఆహారాన్ని జీర్ణం చేసుకునే సామర్థ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. దీనివల్ల ఎప్పుడైనా బయట, ఏదైనా కొత్తగా తిన్నప్పుడు కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు వస్తాయి. ఇలా కాకుండా ఉండాలంటే.. 'రెయిన్‌బో ప్లేట్'ను ఫాలో అవ్వాలి. భోజనంలో వివిధ రంగుల కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. వారానికి కనీసం 30 రకాల మొక్కల ఆధారిత ఆహార పదార్థాలను తీసుకోవాలట. అప్పుడే గట్ హెల్త్ బాగుంటుందని చెబుతున్నారు. ఇక ఆహారంలో పెరుగు, మజ్జిగ లాంటి ప్రో బయోటిక్ పదార్థాలను చేర్చుకుంటే.. మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. పేగుల ఆరోగ్యానికి భరోసా లభిస్తుంది.

# నిద్రపుచ్చే గసగసాలు

నేటి కుర్రకారు హెల్తీఫుడ్ అంటూ.. మన వంటింట్లో ఉండే అద్భుతమైన సహజ పదార్థాలను పట్టించుకోకుండా ఖరీదైన సప్లిమెంట్ల వైపు పరుగులు తీస్తున్నారు. వంటింట్లో ఉన్న ఒక్కో దినుసు.. నాలుగైదుకు తక్కువ కాకుండా ప్రయోజనాలను అందిస్తుంది. గసగసాలు ఆ కోవకే చెందుతాయి. శరీరానికి తక్షణ శక్తిని అందించి, నీరసాన్ని తరిమికొట్టడంలో ఇవి దోహదపడతాయి. గసగసాలు రుచి కోసం ఉపయోగించే దినుసులు మాత్రమే కావు.. అవి ఒక అద్భుతమైన ఔషధాల గనులు. వీటిలో క్యాల్షియం అధిక మోతాదులో ఉంటుంది. నేటి ఆధునిక జీవన శైలిలో సరిగా నిద్రపట్టని వారికి, నీరసం, కీళ్ల నొప్పులతో బాధపడే వారికి గసగసాలు సంజీవనిలా పనిచేస్తాయని రీసెర్చ్ గేట్ అధ్యయనం పేర్కొంది. గసగసాల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఒత్తిడిని తగ్గించి నిద్రకు కారణమయ్యే హార్మోన్ల స్థాయిని క్రమబద్ధీకరించడంలో సాయపడుతుంది. రాత్రి పడుకునే గంట ముందు వేడి పాలల్లో కొద్దిగా గసగసాల పొడి లేదా నానబెట్టిన గసగసాల పేస్ట్ కలుపుకొని తాగితే గాఢ నిద్ర పడుతుంది.



గసగసాల్లో ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి. అలాగే ప్రొటీన్, ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరిచి రోజంతా ఉత్సాహంగా ఉండటానికి తోడ్పడతాయి.

మన శరీరానికి అందాల్సిన క్యాల్షియం, ఫాస్పరస్‌లో సింహభాగం ఒక్క టేబుల్ స్పూన్ గసగసాల ద్వారా పొందొచ్చు. ఇవి ఎముకలను దృఢంగా మారుస్తాయి. వయసు పెరిగే కొద్దీ వచ్చే ఆస్టియో పొరోసిస్ సమస్యలను నివారించడంలో గసగసాలు కీలక పాత్ర పోషిస్తాయి.

నోటిపూతను తగ్గించడంలోనూ గసగసాలు కీలకంగా పనిచేస్తాయి. వీటిలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ పెయిన్ గుణాలు అల్సర్లను తగ్గించడంలో దోహదపడతాయి. గసగసాలను బాగా నానబెట్టి ఆ నీటిని తాగడం లేదా పేస్ట్‌లా చేసి పాలలో కలుపుకొని తాగడం వల్ల శరీరంలో వేడి తగ్గి నోటి పూత త్వరగా తగ్గుతుంది.

# తేనెలో అసలు ఎన్ని రకాలు ఉన్నాయో.. ఏది ఎలాంటి రుచిని అందిస్తుందో తెలుసా..?



తేనె బంగారు రంగు, మధురమైన వాసన, సహజ గుణాలతో ప్రసిద్ధి చెందిన ఆహార పదార్థం. శతాబ్దాలుగా ఇది ఆహారంగానే కాకుండా సంప్రదాయ వైద్యంలో కూడా ఉపయోగంలో ఉంది. పూల నుంచి తేనెటీగలు సేకరించే మకరందం ఆధారంగా తేనె రుచి, రంగు, గాఢత్వం మారుతూ ఉంటాయి. అందుకే అన్ని తేనెలు ఒకేలా ఉండవు. కొన్ని తేనెలు తేలికపాటి రుచితో ఉంటే, మరికొన్ని బలమైన గాఢమైన రుచిని కలిగి ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన కొన్ని ముఖ్యమైన తేనె రకాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు. తేనెటీగలు ఏ పూల నుంచి మకరందాన్ని సేకరిస్తాయో దానిపైనే తేనె ప్రత్యేకత ఆధారపడి ఉంటుంది. ఒకే రకం పూల నుంచి సేకరించిన మకరందంతో తయారైనది మోనోఫ్లోరల్ హనీగా పిలుస్తారు. వివిధ పూల నుంచి సేకరించిన మకరందంతో తయారయ్యేది వైల్డ్ ఫ్లవర్ లేదా మల్టీఫ్లోరల్ హనీగా ఉంటుంది.

**ప్రభావితం చేసే పలు అంశాలు..**

వాతావరణం, నేల స్వభావం, ప్రాసెసింగ్ విధానం కూడా తేనె రుచిని ప్రభావితం చేస్తాయి. అకేసియా తేనె చాలా లేత రంగులో ఉండి స్వల్ప పూల వాసనతో మృదువైన తీపి రుచిని కలిగి ఉంటుంది. అధిక ఫ్రక్టోజ్ ఉండటం వల్ల ఇది చాలా కాలం ద్రవరూపంలోనే ఉంటుంది. టీ, పెరుగు, పండ్లపై చల్లుకోవడానికి లేదా సలాడ్ డ్రెస్సింగ్‌లలో ఉపయోగించడానికి ఇది అనుకూలంగా ఉంటుంది. అలాగే న్యూజిలాండ్‌లో పెరిగే మనూకా మొక్క మకరందం నుంచి మనూకా తేనె తయారవుతుంది. దీనికి గాఢమైన, కొంచెం చేదు కలిగిన ప్రత్యేక రుచి ఉంటుంది. యాంటీ బ్యాక్టీరియల్ గుణాల కారణంగా ఆరోగ్యపరంగా కూడా దీనికి మంచి పేరు ఉంది. వేడి పానీయాలు, మారినేడ్స్ లేదా నేరుగా తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

**క్లోవర్ తేనె వినియోగం ఎక్కువ..**

వైల్డ్ ఫ్లవర్ తేనె వివిధ రకాల పూల నుంచి సేకరించిన మకరందంతో తయారవుతుంది. ఈ తేనె రుచి, రంగు కాలానుసారం మారుతూ ఉంటుంది. కొన్ని తేనెలు తేలికపాటి రుచిని కలిగి ఉండగా, మరికొన్ని గాఢమైన రుచిని ఇస్తాయి. వంటలు, బేకింగ్, బ్రెడ్‌పై రాయడానికి దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు. అదే విధంగా ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఎక్కువగా వినియోగించే తేనెల్లో క్లోవర్ తేనె ఒకటి. లేత బంగారు రంగు, మృదువైన తీపి రుచి దీనికి ప్రత్యేకత. టీ, టోస్ట్, సీరియల్స్, బేకరీ పదార్థాల్లో దీన్ని సాధారణంగా ఉపయోగిస్తారు. బక్‌వీట్ తేనె గాఢమైన రంగు, మందమైన గాఢత్వంతో ఉంటుంది. మొలాసిస్ తరహా రుచి, స్వల్ప పొగ వాసన కలిగి ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఈ తేనెను బలమైన రుచులను ఇష్టపడేవారు ఎక్కువగా తీసుకుంటారు. జింజర్ బ్రెడ్, స్పైసీ కేక్స్ వంటి బేకింగ్ వంటల్లో ఇది బాగా సరిపోతుంది.

**పేస్ట్రీలు, కేకులకు అయితే..**

యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రసిద్ధి చెందిన హీతర్ తేనె గాఢ అంబర్ రంగులో ఉండి జెల్లీ తరహా టెక్స్చర్ కలిగి ఉంటుంది. పూల వాసనతోపాటు చెక్క వాసన కలిసిన ప్రత్యేక రుచి ఉంటుంది. చీజ్, రోస్ట్ చేసిన మాంసాహార వంటకాలు, క్రంపెట్స్‌తో ఇది బాగా సరిపోతుంది. సిట్రస్ పూల మకరందం నుంచి తయారయ్యే ఆరెంజ్ బ్లాసమ్ తేనెకు సున్నితమైన నారింజ వాసన ఉంటుంది. డెజర్ట్స్, హెర్బల్ టీలు, సలాడ్ డ్రెస్సింగ్‌లలో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. పేస్ట్రీలు, కేకులకు కూడా ఇది మంచి కాంబినేషన్‌గా ఉంటుంది. ఇక ముడి తేనెని ఎక్కువగా వేడి చేయకుండా సహజ రూపంలోనే ఉంచుతారు. అందువల్ల ఇందులో సహజ ఎంజైమ్స్, పుప్పొడి గుణాలు ఎక్కువగా ఉంటాయి. సెట్ హనీ లేదా క్రీమ్డ్ హనీ మాత్రం మృదువుగా, సులభంగా రాయడానికి అనుకూలంగా ఉండేలా క్రిస్టలైజ్ చేస్తారు. టోస్ట్, బేకింగ్ వంటకాల్లో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. తేనె కొనుగోలు చేసే సమయంలో దాని మూలం, స్వచ్ఛత, ప్రాసెసింగ్ విధానం తెలుసుకోవడం మంచిది. సహజ తేనె రుచి మాత్రమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. తదుపరి తేనె జార్ తీసుకునేటప్పుడు దాని ప్రత్యేకతను గమనిస్తే మీకు కొత్త రుచులు కూడా పరిచయం అవుతాయి.

# ఫైనల్‌కి దూసుకెళ్లిన సాత్విక్- చిరాక్ జోడి..



**హైదరాబాద్ పెన్ పవర్:** థాయ్‌లాండ్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్-500 టోర్నమెంట్ లో భారత స్టార్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టి అద్భుత ప్రదర్శనలు కనబరుస్తోంది. ఈరోజు (2026, మే16న) ఉత్కంఠభరితంగా కొనసాగిన సెమీ ఫైనల్ పోరులో మలేషియా జోడీ గో జెఫీ-నూర్ ఇజ్జుద్దీన్‌పై 19--21, 22-20, 21-16 తేడాతో సాత్విక్ - చిరాక్ ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లారు. ఈ సీజన్‌లో తొలి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకున్న జోడీగా అవతరించింది.

ప్రపంచ నంబర్ 4 ర్యాంక్‌లో ఉన్న ఇండియన్ జోడీ 19-21, 22-20, 21-16 తేడాతో మలేషియాపై గెలిచింది. గంటా 22 నిమిషాల పాటు జరిగిన ఈ ఫైట్ లో సాత్విక్ -- చిరాక్ జోడీ అద్భుత పోరాట పటిమ కనబరిచారు. ఈ గెలుపుతో మలేషియా జోడీపై తమ హెడ్-టు-హెడ్ రికార్డును 8-2కు పెంచుకుంది. పీవీ సింధు, లక్ష్యసేన్ ఇప్పటికే ఈ టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ.. భారత్ ఆశలన్నీ ఈ జోడీపైనే నెలకొన్నాయి. కాగా తొలి సెట్‌ను మలేషియా ఆటగాళ్లు గో జెఫీ-నూర్ ఇజ్జుద్దీన్ 20--19 తేడాతో కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్న ఇండియన్ జోడీ రెండో సెట్‌ను 22-20తో దక్కించుకుంది. మ్యాచ్‌ను తేల్చే మూడో సెట్‌లో గెలుపు కోసం ఇరు జట్లూ తీవ్రంగా కష్టపడ్డాయి. కానీ సాత్విక్- చిరాక్ జంట అద్భుతమైన ప్రదర్శనతో 21- 16తో సెట్‌ను గెలిచి.. ఫైనల్‌కు దూసుకుపోయింది.

# కేకేఆర్ వర్సెస్ గుజరాత్ మ్యాచ్‌కు వర్షం గండం.. వెదర్ రిపోర్ట్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 లీగ్ దశ ముగింపుకు వస్తుండటంతో ప్రతీ మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారుతోంది. కాసేపట్లో కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్ మధ్య జరగబోయే మ్యాచ్‌కు వాతావరణం ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే కేకేఆర్‌కు తమ మిగిలిన మూడు మ్యాచుల్లోనూ గెలవడం అత్యంత కీలకం కాగా.. ఇలాంటి టైమ్‌లో వర్షం పడి మ్యాచ్ రద్దయితే కోల్‌కతా ఆశలు గల్లంతవుతాయి.

**కోల్‌కతా ప్రస్తుత వాతావరణం:**
ప్రస్తుతానికి కోల్‌కతాలో వర్ష సూచనలు పెద్దగా లేవు. మ్యాచ్ ప్రారంభ సమయానికి నగరం అంతటా అక్కడక్కడా చెదురుమొదురుగా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వర్షం కంటే కూడా ప్రస్తుతం కోల్‌కతాలో ఉన్న విపరీతమైన వేడి, ఉక్కపోత ఆటగాళ్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టేలా ఉంది. ఇలాంటి క్లైమేట్‌లో ప్లేయర్స్ తమ ఎనర్జీని కాపాడుకోవడం సవాలుతో కూడుకున్నది. ఇక మ్యాచ్ జరిగే సమయంలో వర్షం పడేందుకు దాదాపు ఎలాంటి అవకాశాలు లేవని వాతావరణ అధికారులు చెబుతున్నారు.

**అధిక ఉష్ణోగ్రతలు:**
సాయంత్రం వేళల్లో హ్యూమిడిటీ (తేమ) 70 నుంచి 80 శాతం వరకు ఉండే అవకాశం ఉంది. దీనివల్ల మొదటి ఇన్నింగ్స్ సమయంలో 'ఫీల్స్ లైక్' (ఉష్ణోగ్రత తీవ్రత) ఏకంగా 42°C (109°F) గా నమోదయ్యే ప్రమాదం ఉంది. ఇది ఆటగాళ్లకు తీవ్రమైన చెమట, అసౌకర్యాన్ని కలిగిస్తుంది.

**పిచ్ రిపోర్టు:**
ఐపీఎల్ 2026లో ఈడెన్ గార్డెన్స్ పిచ్ సాధారణం కంటే కాస్త స్లోగా కనిపిస్తోంది. ఇది అటు పేసర్లు, ఇటు స్పిన్నర్లు ఇద్దరికీ సమానంగా సహకరిస్తోంది. కొత్త బంతితో పేసర్లకు ల్యాటరల్ మూవ్‌మెంట్, బౌన్స్ లభిస్తుండగా.. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్లకు పిచ్ నుంచి మంచి గ్రిప్, టర్న్ దక్కుతోంది. బంతి ఒక్కసారి ఇన్‌ఫీల్డ్ దాటిందంటే మెరుపు వేగంతో బౌండరీకి దూసుకెళ్తుంది.

**వర్షం పడే ఛాన్స్ తక్కువ:**
గత కొన్ని రోజులుగా కోల్‌కతాలో పెద్దగా వర్షాలు పడలేదు. ఈ రోజు (మే 16) వర్షం పడే అవకాశాలు ఉన్నట్లు ఉదయం సూచించినప్పటికీ, మ్యాచ్ జరిగే సమయానికి ఎలాంటి అంతరాయం ఉండకపోవచ్చని తాజా వెదర్ రిపోర్ట్స్ స్పష్టం చేస్తున్నాయి. కాబట్టి క్రికెట్ ఫ్యాన్స్‌కు పూర్తి 40 ఓవర్ల హైవోల్టేజ్ మ్యాచ్ ఎంటర్‌టైన్‌మెంట్ లభించడం పక్కా!.

# ఆ ఒక్క తప్పుతోనే లక్నో చేతిలో ఓటమి.. ప్లేఆఫ్స్ రేసును సంక్లిష్టం చేసుకున్న CSK



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ చివరి దశకు చేరుకున్న వేళ చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) జట్టుకి ఊహించని షాక్ తాకింది. ప్లేఆఫ్స్ రేసు నుంచి ఇప్పటికే నిష్క్రమించి, ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడుతున్న లక్నో సూపర్ జెయింట్స్ (ూూ+) చేతిలో చెన్నై ఘోర పరాజయాన్ని చవి చూసింది. ఈ ఓటమితో సీఎస్కే పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి పడిపోవడమే కాకుండా, తమ ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత కఠినతరం చేసుకుంది.

**జట్టు ఎంపికలో తప్పిదాలు:**
కీలకమైన మ్యాచులో చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు జట్టు కొంపముంచాయని మాజీ క్రికెటర్లు అభిప్రాయ పడుతున్నారు. గాయపడిన జేమీ ఓవర్టన్ స్థానంలో స్పెన్సర్ జాన్సన్‌ను టీమ్ లోకి తీసుకున్నారు. కానీ లక్నో పిచ్ పరిస్థితుల దృష్ట్యా అద్భుతమైన ఫాంలో ఉన్న స్పిన్నర్ అకీల్ హుసేన్ ని పక్కన పెట్టడం మైనస్‌గా మారింది. మరో స్పిన్నర్ నూర్ అహ్మద్ ఒకవైపు రన్స్ ని కట్టడి చేసినా, అతనికి తోడుగా అకీల్ హుసేన్ ఉండి ఉంటే (కనీసం ఇంపాక్ట్ ప్లేయర్‌గా) లక్నో బ్యాటర్లపై ఒత్తిడి పెంచే ఛాన్స్ ఉండేది.

**అన్షుల్ కాంబోజ్ చెత్త రికార్డు!:**
ఈ సీజన్‌లో సీఎస్కే తరఫున అత్యధిక వికెట్లు తీసి, పర్పుల్ క్యాప్ రేసులో దూసుకుపోతున్న అన్షుల్ కాంబోజ్ కి లక్నోతో జరిగిన మ్యాచ్ ఒక పీడకలగా మిగిలిపోయింది. ూూ+ బ్యాటర్లు అతడిని పూర్తిగా టార్గెట్ చేశారు. ఇన్నింగ్స్ 5వ ఓవర్ వేసిన కాంబోజ్ బౌలింగ్‌లో మిచెల్ మార్ష్ ఏకంగా 4 సిక్సర్లు కొట్టాడు. అలాగే 17వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన కాంబోజ్‌ను నికోలస్ పూరన్ ఓ ఆట ఆడుకున్నాడు. మొదటి 4 బంతుల్లోనే 4 సిక్సర్లు కొట్టి మ్యాచ్‌ను కంప్లీట్ చేసేశాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే ఒకే మ్యాచ్‌లో, రెండు వేర్వేరు ఓవర్లలో నాలుగేసి సిక్సర్లు (మొత్తం 8 సిక్సర్లు) సమర్పించుకున్న ఏకైక బౌలర్‌గా కాంబోజ్ చెత్త రికార్డుని మూటగట్టుకున్నాడు. కేవలం 2.4 ఓవర్లలోనే 63 రన్స్ సమర్పించి సీఎస్కే ఓటమికి కారణమయ్యాడు.

**సీఎస్కే ప్లేఆఫ్స్ సమీకరణాలు:**
ప్రస్తుతం 12 మ్యాచులు ఆడిన చెన్నై 6 విజయాలు, 6 ఓటములతో పాయింట్ల పట్టికలో 6వ స్థానంలో కొనసాగుతుంది. చెన్నై ఇంకా 2 లీగ్ మ్యాచులు ఆడాల్సి ఉంది. మే 18: సన్‌రైజర్స్ హైదరాబాద్ (ూ=ు)తో రసవత్తర పోరు ఉండగా.. మే 21: గుజరాత్ టైటాన్స్ (GT)తో చివరి లీగ్ మ్యాచ్ ఆడబోతుంది.

**సీఎస్కే ప్లేఆఫ్స్ చేరాలంటే?:**
చెన్నై సూపర్ కింగ్స్ కచ్చితంగా ఈ రెండు మ్యాచుల్లోనూ భారీ రన్‌రేట్‌తో గెలవాల్సి ఉంది. అలా గెలిచినా కూడా ఇతర జట్ల (ముఖ్యంగా టాప్-4 రేసులో ఉన్న జట్లు) గెలుపోటములపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇందులో ఒక్క మ్యాచ్ ఓడినా చెన్నై ప్లేఆఫ్స్ ఆశలు గల్లంతయినట్లే!.. టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

# ఇండిపెండెంట్ మ్యూజిక్‌తోనూ అద్భుతాలు!

**అవ్నీత్ కౌర్: గ్లామర్ మరియు ప్రతిభను మిళితం చేసిన రైజింగ్ స్టార్**





డిజిటల్ యుగంలో సక్సెస్ అవ్వడానికి ట్యాలెంట్ ఉంటే చాలు. ప్రత్యేకించి సినిమా రంగంలో స్థిరపడాలనుకునే వారికి డిజిటల్ మాధ్యమాలు ఎంతగా దోహదపడుతున్నాయో తెలిసిందే. ట్యాలెంట్ ను ప్రూవ్ చేసుకుంటూ ఒక్క వీడియో చేస్తే చాలు.. అది చేరాల్సిన వారికి చేరితో ప్రతిభను గుర్తించి పిలిచి మరీ అవకాశాలిస్తోన్న రోజులివి. ఈ మధ్య కాలంలో అలా వెలుగులోకి వస్తోన్న సంగీత దర్శకుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. ఇండిపెండెంట్ సంగీతానికి కూడా శ్రోతలను విశేషంగా అలరిస్తోంది. ఈ క్రమంలోనే ప్రముఖ సింగర్ కయాన్ ఇండిపెండెంట్ మ్యూజిక్ సాధిస్తున్న పురోగతి గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. స్వతంత్ర సంగీతానికి అద్భుతమైన సమయం నడుస్తోంది. గతంలో సినిమా పాటల నీడలో మరుగున పడిపోయిన ఇండిపెండెంట్ కళాకారులకు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తోందన్నారు. -మనం ఇప్పుడు గ్లోబల్ విలేజ్‌లో ఉన్నాం. ఇక్కడ సంగీతం ఒక ప్రాంతానికే పరిమితం కాదు. ఆధునిక బీట్స్ కలయికతో వస్తోన్న పాటలను ప్రపంచవ్యాప్తంగా ఆదరిస్తున్నారన్నారు. ఇలాంటి ఎలాంటి ఒత్తిళ్లకు గురవుతున్నారో కూడా వివరించారు. సింగర్‌ను , మ్యుజీషియన్‌ను ఒకే రకమైన శైలికి పరిమితం చేయాలని చూడటం సరికాదని కయాన్ అన్నారు. తాను ఎప్పుడూ రొటీన్ పద్ధతులకు లొంగిపోలేదని నచ్చిన రీతిలో ప్రయోగాలు చేయడానికే ఇష్టపడతానన్నారు. ఇండస్ట్రీ నిర్దేశించిన ఫార్ములాలను పాటించకుండా స్వంత అభిరుచితో చేసినప్పుడే నిజమైన కళాఖండాలు పుడతాయని కయాన్ వెల్లడించారు. కానీ స్వతంత్ర కళాకారిణిగా నిలదొక్కుకోవడం అంత సులభం కాదన్నారు. ఇందులో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని అధిగమించి ప్రయాణం చేయాల్సి ఉంటుందుందన్నారు. కానీ ప్రేక్షకుల నుంచి లభిస్తున్న స్పందన చూస్తుంటే? ఎలాంటి ఒత్తిళ్లు అయినా దాటొచ్చు.ఒక్క సక్సెస్ ఎంతో ఉత్సాహాన్ని నింపుతోందన్నారు. మారుతోన్న కాలానికి అనుగుణంగా శ్రోతలు కూడా కొత్త తరహా సంగీతాన్ని ఆస్వాదించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇది తమలాంటి యంగ్ మ్యుజీషియన్లకు పెద్ద వరమని కయాన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భారతీయ స్వతంత్ర సంగీతం ప్రత్యేక అస్తిత్వాన్ని సృష్టించుకుందని అంతా నమ్ముతున్నారు. వెస్ట్రన్ మ్యూజిక్‌ను అనుకరణతో పాటు, మూలాలను మర్చిపోకుండా కొత్తదనాన్ని జోడించడం వల్లే ఇండి మ్యూజిక్ ముమెంటం అందుకుందన్నారు. భవిష్యత్తులో ఈ రంగం మరిన్ని శిఖరాలను అధిరోహిస్తుందని సినిమా సంగీతంతో సమానంగా ఇండి మ్యూజిక్ కూడా రాజ్యమేలుతుందని అభిప్రాయపడ్డారు. కయాన్ వంటి కళాకారులు చూపిస్తున్న తెగువ , సృజనాత్మకత భారతీయ సంగీత రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది.



**పూజిత పొన్నాడ యొక్క ప్రకాశవంతమైన కొత్త లుక్ సోషల్ మీడియాలో హృదయాలను గెలుచుకుంది**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965